RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 135 ఆదివారం, జూన్ 30, 2024 పేజీలు : 4

## పిసి ఘోష్ కమిషన్ గడువు పెంపు

హైదరాబాద్: కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ గడువును మరో రెండు నెలలకు పొడగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పిసి ఘోష్ నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నెలతో పిసి ఘోష్ కమిషన్ గడువు పూర్తవుతుంది. కాగా విచారణ కొనసాగుతున్నందున గడువును ఆగస్టు 31 వరకు పొడగించారు. విచారణకు హాజరైన మాజీ ఈఎన్సీలు, ప్రస్తుత ఈఎన్సీలు, సిఈలు, ఇతర ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను పూర్తి వివరాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ నెల ఆరంభంలో నిర్వహించిన విచారణ సందర్భంగా న్యాయమూర్తి పిసి. ఘోష్ ఆదేశించారు. దాంతో 60 మంది సీల్డు కవర్లలో గురువారం అఫిడవిట్లను దాఖలు చేసినట్లు తెలిసింది.

## జులై 12 వరకు...
# జుడీషియల్ కస్టడీ



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఢిల్లీ కోర్టు జులై 12 వరకు జుడీషియల్ కస్టడీకి పంపింది. పరిశోధన అధికారులు సేకరించిన వివరాలను వెల్లడించాలని ఆయన పెట్టుకున్న వినతిని కోర్టు తిరస్కరించింది. మూడు రోజుల కస్టోడియల్ ఇంటరాగేషన్ గడువు ముగియడంతో కేజ్రీవాల్ ను వెకేషన్ కోర్టు జడ్జీ సునేనా శర్మ ముందు హాజరుపరిచారు. ఆయన్ని జుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని సిబిఐ పెట్టుకున్న వినతిని జడ్జీ సునేనా శర్మ అనుమతించారు. కేజ్రీవాల్ ను జూన్ 26న లాంఛనంగా అరెస్టు చేశారన్నది తెలిసిందే. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి కోర్టులో ఈ కేసు పరిశోధన 2022 ఆగస్టు నుంచి కొనసాగుతోందని కోర్టుకు తెలిపారు. మార్చి 21న మొదట ఈడి ఆయన్ని అరెస్టు చేసింది. తర్వాత మే 10న మూడు వారాల పాటు తాత్కాలిక బెయిల్ ను ఆయనకు కోర్టు మంజూరు చేసింది. ఆ తర్వాత సిబిఐ తమకు కొన్ని ఆధారాలు దొరికాయని కోర్టుకు తెలిపింది. ఒకవేళ సిబిఐ మూడు విషయాల్లో కోర్టును సంతృప్తి కలిగించకపోతే కేజ్రీవాల్ రిమాండ్ ప్రొసీడింగ్స్ అక్రమమే అవుతాయని కేజ్రీవాల్ న్యాయవాది విక్రమ్ చౌదరి అన్నారు.

## పర్యాటక అభివృద్ధికి...
# రూ. 110 కోట్లు



**వికారాబాద్:** జిల్లాలో పర్యాటక అభివృద్ధికి స్వచ్ఛదర్శన్ పథకం కింద రూ. 110 కోట్లు మంజూరు అయ్యాయని, ఇట్టి నిధులతో 213 ఎకరాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికల రూపొందించారని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్టేట్ ఛాంబర్‌లో అనంతగిరి పర్యాటక అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అటవీ, దేవాదాయ, మిషన్‌భగీరథ, భూగర్భజలాల, మున్సిపల్ విభాగాల అధికారులతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లతో కలిసి స్పీకర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులతో పేదలకు ఉపాధి కలిగేలా ఉండాలని, అదేవిధంగా ఆదాయ వనరులపై నివేదిక రూపొందించాలని సూచించారు. గతంలోనే పర్యాటక అభివృద్ధికి 225 కోట్లు మంజూరైనప్పటికీ రూ. 25 కోట్లతోనే అభివృద్ధి పనులు చేశారని ఆయన తెలిపారు. పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతో కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటుతో పర్యాటకుల రద్దీ పెరిగిందని, స్థానికులకు ఉపాధిదొరికిందని గుర్తు చేశారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటక ప్రాంత అభివృద్ధిలో భాగంగా స్థానికులకు పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలు ఉండాలన్నారు. జిల్లాలోని అనంతగిరి ప్రాంత అభివృద్ధితో పాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్, లక్నాపూర్ ప్రాజెక్టులు, దామగుండం ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టే వివిధ పనులను ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ మేనేజర్ సుమతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా
# తీర్చిదిద్దుతా



వరంగల్: తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్య రంగాన్ని విస్తరించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఇక్కడ హాస్పిటల్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈరోజు(శనివారం) వరంగల్‌లో సీఎం రేవంత్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విద్య, వైద్యం, విద్యుత్ అందుబాటులో ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందిందన్నారు. ఫార్మారంగం ఎప్పుడు చర్చకు వచ్చినా అందులో హైదరాబాద్‌కు స్థానం ఉంటుందని తెలిపారు. ఇందుకు కారణం దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దూర దృష్టినేనని చెప్పారు. రాజీవ్ గాంధీ చొరవతో తెలంగాణలో ఐటీ రంగం రాణించిందన్నారు.

## మాజీ ఎంపి, బిజెపి నేత రమేష్ రాథోడ్ మృతి



హైదరాబాద్: మాజీ ఎంపి, బిజెపి నేత రమేష్ రాథోడ్ కన్నుమూశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులోని తన నివాసంలో శుక్రవారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావ తో చికిత్స కోసం కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే.. ఆయన పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఆయన మృతదేహాన్ని సొంత గ్రామం ఉట్నూరుకు తరలిస్తున్నారు. రమేశ్ రాథోడ్ మృతి పట్ల అభిమానులు, రాజకీయనాయకులు సంతాపం తెలుపుతున్నారు.

# కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్..



కొండగట్టు: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ ఇలవేల్పు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని శనివారం నాడు దర్శించుకున్నారు. అంజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. గత ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వారాహి విజయ యాత్రకు ముందు వారాహి వాహనానికి కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో తెలంగాణ, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఆలయానికి చేరుకున్నఆయనకు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధాన స్థానాచార్యులు కపీంద్ర స్వామి పవన్ కళ్యాణ్ కి సంప్రదాయబద్దంగా తలపాగ చుట్టి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇరు వైపులా ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ అమ్మవార్లకు అర్చనలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించి, స్వామి వారి ప్రసాదం అందచేశారు.

అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయానంతరం ఉప ముఖ్యమంత్రి హోదాలో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దర్శనానికి బయలుదేరిన పవన్ కి తెలంగాణలో జనసేన శ్రేణులు అడుగడుగునా ఘన స్వాగతం పలికాయి. హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు ఇచ్చి సాగనంపారు. తుర్కపల్లి, శామీర్ పేట, సిద్ధిపేట, కరీంనగర్, గంగాధర తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభిమానులు, పార్టీ శ్రేణులు గజమాలలతో స్వాగతించారు. పవన్ కళ్యాణ్ గారి విజయానికి చిహ్నంగా తల్వార్ బహూకరించి జేజేలు పలికారు. పవన్ కళ్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతం అంతా పార్టీ శ్రేణులు అభిమానులతో కిటకిటలాడింది. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ శ్రీ పవన్ కళ్యాణ్ ముందుకు సాగారు. ఈ పర్యటనలో పార్టీ ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, తెలంగాణ ఇంఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు సాగర్, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, రాధారం రాజలింగం, వై.నగేష్, సంపత్ నాయక్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌తో సమానంగా...
# వరంగల్ అభివృద్ధి



**వరంగల్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. వరంగల్ అభివృద్ధిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా సమీక్షా సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. హైదరాబాద్ తో సమానంగా వరంగల్ ను అభివృద్ధి చేయాలన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్‌లో గీసుకొండ మండలం శాయంపేటకు చేరుకున్న రేవంత్ రెడ్డి టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ పురోగతిని పరిశీలించారు. పార్క్ నిర్మాణం ఎక్కడి దాకా వచ్చిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవంలో భాగంగా మెగా టెక్స్‌టైల్ పార్కు ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అధికారులు మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన వారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్కు సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడుతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో ప్లాంటేషన్‌తో పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు.. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా చేపట్టినవి, ప్రగతిలో ఉన్నవి, చేపట్టాల్సిన పనులపై రివ్యూ చేస్తారని తెలిపారు. వరంగల్ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ 2050ని రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.




హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 2024, జూన్ 29వ తేదీ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డి.శ్రీనివాస్ ఉమ్మడి ఏపీలో మంత్రిగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు.

ప్రస్తుతం ఆయన రెండో కుమారుడు ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు. పెద్దకుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్ గా పనిచేశారు. 2014 తర్వాత కాంగ్రెస్?కు డి. శ్రీనివాస్ రాజీనామా చేసి బీర్ఎస్?లో చేరారు. బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన డీఎస్.. అనంతరం బీఆర్ఎస్?ను వీడి మళ్లీ సొంతగూటికి చేరారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని నివాసంలో డీఎస్ పార్థీవదేహం ఉంచారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. డీఎస్ నివాసానికి కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు చేరుకుంటున్నారు. రేపు నిజాబామాద్‌లో డీఎస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### డి శ్రీనివాస్ మృతి పట్ల సిఎం రేవంత్ సంతాపం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని అభిప్రాయపడ్డారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్.. రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తు చేసుకున్నారు. డీ శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 2024, జూన్ 29వ తేదీ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## సంపాదకీయం

### చదువురాని అవివేకులు

# పాలకులైతే...?

2015లో ఎన్‌డిటివికి ఇచ్చిన ఇంటర్వూలో స్వయంగా లాల్ కృష్ణ అద్వానీ ఇలా చెప్పారు. 'నలభై ఏళ్ళ క్రితం ఇందిరా గాంధీ పరిపాలనలో విధించిన ఎమర్జెన్సీ వదిలేయండి. అది కేవలం కొన్ని నెలలు మాత్రమే ఇప్పుడు మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ఎమర్జెన్సీలోనే ఉంది. ఏళ్లకేళ్ళు గడిచినా అనధికార, అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది'! భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మీద అక్కసుతో నెహ్రూ జన్మస్థలమైన అలహాబాద్ పేరు మార్చి ప్రయాగ్‌రాజ్ అన్నారు. ఢిల్లీలోని నెహ్రూ మ్యూజియం పేరు మార్చి పి.ఎం మ్యూజియం అన్నారు. అందులో ఉన్నవన్నీ నెహ్రూ వస్తువులే. ఇతర ప్రధానుల జ్ఞాపక చిహ్నాలేవీ లేవు. ఈ పేరు మార్చే రోగం ఈ ప్రభుత్వానికి ఎందుకు పట్టిందో తెలియదు. వీరు పెట్టిన పేర్లు చిరకాలం ఉంటాయా? పుస్తకాల గది నుండి వచ్చేవారే ఈ సమాజానికి అవసరం. పూజ గది నుండి వచ్చేవారు బహుశా.. పునర్జన్మలకు మాత్రమే అవసరమేమో ఆర్థర్ జాన్, అమెరికన్ సైకియాట్రిస్ట్. పుస్తకాల గురించి, పుస్తకాలు చదవడంలోని ఆనందం గురించి భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ ఇలా రాసుకున్నారు పుస్తక ప్రేమికులకు, అధ్యయన శీలురకు ఆయన మాటలు తప్పకుండా స్ఫూర్తినిస్తాయి 'నేను చదివిన పుస్తకంలోని తత్వాన్ని బయటకు తీస్తాను. అవసరం లేని భాగాన్ని వదిలేస్తాను. 'జ్ఞానం అనేది శక్తి. ఆనంద సాధనం' అన్న హైంజలైట్ అన్న మాటలు అక్షర సత్యం! పుస్తకం చదవడం మొదలు పెట్టగానే నాకు అనంతమైన సుఖానుభవం కలుగుతుంది. చదవడంలో నాకు కలిగే ఆనందం వర్ణింపనలవికానిది.. నాకు బాధ కలిగించే విషయమేమంటే చాలా మంది మనవాళ్ళు చదవరు. అధ్యయనం లేకుండా జ్ఞానం జ్ఞానం లేకుండా శక్తీ రావు. ఎవరికైనా తలపడే ముందు మనం జ్ఞానంతో, శక్తియుక్తులతో సమర్ధవంతంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ చదివే అభిరుచిని పెంచుకోవాలి. నేను వెనిస్ నుండి బొంబాయికి ప్రయాణిస్తూ ఆరు రోజుల్లో ఎనిమిది వేల పేజీలు చదివాను. మరోసారి అరవై నాలుగు గంటల పాటు ఒక పుస్తకాన్ని అది పూర్తయ్యే వరకు చదివాను. పుస్తకాలు దీపాల వంటివి. అవి మనో మాలిన్యమనే చీకటిని తొలగిస్తాయి. నేను నా భార్యా బిడ్డల కంటే పుస్తకాలనే ఎక్కువగా ప్రేమిస్తాను. విద్యా వికాసాలు పొందాలి. విద్యా వికాసాల్ని ఇతరులకు అందించాలి. అంతర్గతంగా ఆందోళన పడాలి. మార్పుకోసం ఆందోళన చేయాలి. సంఘటిత పడాలి. సమైక్యంగా ముందుకు సాగాలి. ఒక దేవాలయ నిర్మాణం కంటే ఒక గ్రంథాలయ నిర్మాణం ఎన్నో లక్షల రెట్లు గొప్పది. దేవాలయం ముష్టివాళ్లను సృష్టిస్తే గ్రంథాలయం దేశాన్ని మార్చే మహావీరుల్ని సృష్టిస్తుంది" అని అన్నారు డా. బిఆర్ అంబేద్కర్. మానవీయ విలువల దృష్టికోణంతో అంబేద్కర్ కృషిని బేరీజు వేస్తే అది ఇలా ఉంటుంది. "ఇన్సానోంకొ గులాం బనాకర్/ హజారోం బాదుషా బనేహ/ లేకిన్ గులామోంకో ఇన్‌సాన్ బనాకర్/ సిర్ఫ్ ఏక్ హి బాద్‌షా బనేహ ఓ హై డా. బీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్!" అంటే అర్థం మనుషుల్ని బానిసలుగా చేసి వేల మంది చక్రవర్తులయ్యారు. కాని, బానిసల్ని మనుషులుగా చేసిన చక్రవర్తి ఒకే ఒక్కడు ఆయనే డా. బీమ్‌రావ్ రామ్ జీ అంబేద్కర్. ఆయన విద్యార్హతలు కూడా ఒకసారి గమనిద్దాం. ఫాసిస్టులకు అంబేద్కర్ అంటే పడదు. కాలాలకు అతీతంగా అత్యున్నతమైన విద్య నార్జించిన ఆర్థిక వేత్త అయ్యాడని ఉడుకుమోతు తనం! ఆయన విద్యార్హతలు ఏ కాలంలోనైనా ఆశ్చర్యం కలిగించేవే! 1917 పిహెచ్‌డి కొలంబియా యూనివర్శిటీ. 1921లో ఎంఎస్‌సి అండన్ స్కూల్ ఆప్ ఎకనమిక్స్. 1922 30 సెప్టెంబర్, బారిస్టర్ ఎట్ లా గ్రేట్ బ్రిటన్, లండన్. 1923 నవంబర్ డిఎస్‌సి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్. 1952 గౌరవ డాక్టరేట్ ఎల్‌ఎల్‌డి కొలంబియా యూనివర్శిటీ. 195312 జనవరి డి.లిట్ గౌరవ డాక్టరేట్. ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్. రెండు మాస్టర్స్ డిగ్రీలు, నాలుగు డాక్టరేట్లు. ఇన్ని డిగ్రీలు ఇంత జ్ఞాన సంపదను సంపాదించిన భారతీయుడిగాగుర్తించి, న్యూయార్స్ కొలంబియా యూనివర్శిటీలో ఆయన విగ్రహం ప్రతిష్టంచారు. అదీ ఎందుకూ? జ్ఞాన సంకేతంగా 'సింబల్ ఆఫ్ నాలెడ్జ్'గా గౌరవించారు. చదువుకు, విజ్ఞతకు, సమాజోద్ధరణకు అవినాభావ సంబంధం ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉండి, మన దేశాన్ని ఫాసిస్ట్ ధోరణిలోకి నెట్టేస్తున్న వారి విద్యార్హతలేమిటీ? వారి వివేకం ఎక్కడా? మత విద్వేషాలు రెచ్చగొట్టి మారణకాండలు సృష్టించడమే పనిగా పెట్టుకున్న వీరు, చరిత్ర హీనులుగా మిగలరా? ఆరో తరగతిలో బడి నుండి పారిపోయిన వాడిని వెతుక్కొచ్చి రాజ్యాధికారం కట్టబెడితే ఏమవుతుంది? పిచ్చోడి చేతి లో రాయి అవుతుంది. బ్రిటీష్ రాజనీతిజ్ఞుడు ఫ్రాన్సిస్ బేకన్ చెప్పిన ఈ మాట ఎంత గొప్పగా ఉందో ఆలోచించండి. 'చదువు మనిషిని పూర్తిగా మానవుడిగా తీర్చిదిద్దుతుంది. చర్చ సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది. రాత ఖచ్చితమైన మానవుడిగా తీర్చిదిద్దుతుంది'. చదువుకున్న వివేకవంతులకే సోషలిజం విలువ తెలుస్తుంది. చదువు, సంస్కారం, మానవీయ విలువలపై గౌరవ భావంలేని పాలకులు కేవలం జంగిల్ రాజ్యం స్థిరపరిచి, ఆటవిక పాలనను అందించగలరు.

# తెలంగాణలో బ్లాక్ బుక్ సంచలనం




**కరీంనగర్, జూన్ :** హాట్ టాపిక్ గా బ్లాక్ బుక్ వార్నింగ్..తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బ్లాక్ బుక్ హెచ్చరిక హాట్‌టాపిక్‌గా మారింది. అధికార కాంగ్రెస్ నేతల అవినీతికి వంతపాడుతున్న అధికారులు, అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలు రాష్ట్రంలో మళ్లీ బ్లాక్ డేస్ తెస్తున్నారని.. అలాంటి వారిపై చర్యలకు బ్లాక్ బుక్ రాస్తానని ప్రకటించారు కౌశిక్‌రెడ్డి. రామగుండం ఎన్టీపీసీ బూడిద తరలింపులో అక్రమాలపై మంత్రి పొన్నం 100కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపిస్తూ కొద్ది రోజుల క్రితం తీవ్ర ఆరోపణలు చేశారు కౌశిక్‌రెడ్డి. ఈ క్రమంలో పొన్నం తప్పు చేయలేదంటే వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ చేశారు. ఈ క్రమంలోనే తాను బ్లాక్ బుక్ రాస్తున్నానని ?. అందులో తొలి పేరు మంత్రి పొన్నందేనంటూ బుక్‌లో రాసి మీడియాకు ప్రదర్శించారు కూడా? అయితే ఇంతకీ ఈ బ్లాక్ బుక్ రాయాలనే ఆలోచన కౌశిక్‌రెడ్డి సొంతంగా తీసుకున్నదా? పార్టీ సూచనలు, ఆదేశాలు ఏమైనా ఉన్నాయా? అన్నది మాత్రం స్పష్టం కాలేదు. తాను రాసే బ్లాక్ బుక్‌లో పేర్లు ఉన్నవారిపై బీఆర్ఎస్ అధికారంలో రాగానే చర్యలు ఉంటాయని కౌశిక్‌రెడ్డి చెప్పడం? ఇటు బీఆర్ఎస్‌లోనూ.. అటు కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశంగా మారింది. అసలు ఏ అధికారంతో పార్టీ తరపున కౌశిక్‌రెడ్డి ప్రకటన చేస్తారంటూ గులాబీ పార్టీ నేతలే గొణుక్కుంటున్నారు. ఏపీలో టీడీపీ యువనేత లోకేశ్ రెడ్‌బుక్ నుంచి స్ఫూర్తి పొంది? కౌశిక్‌రెడ్డి అలాంటి ప్రకటన చేశారా? అంటూ కొందరు ఆరా తీస్తున్నారు. లోకేశ్ అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడిగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో పార్టీలో నిర్ణయం తీసుకుని రెడ్‌బుక్ రాశారని?. కౌశిక్‌రెడ్డికి పార్టీలో ఏం అధికారం ఉందని వారు ప్రశ్నిస్తున్నారు. నిన్న గాక మొన్న పార్టీలో చేరి? ఈటల రాజేందర్ పుణ్యమా అని ఎమ్మెల్సీ అయిపోయారని? కాలం కలిసివచ్చి ఎమ్మెల్యే అయినంత మాత్రాన తనదే పార్టీ అన్నట్లు బ్లాక్ బుక్ రాయడమేంటని ప్రశ్నిస్తున్నారు మరికొందరు నేతలు.కేటీఆర్ లేదా కేసీఆర్ లు ఏమైనా కౌశిక్‌కు ప్రత్యేక అధికారాలిచ్చారా? అంటూ కొంతమంది బీఆర్ఎస్ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై అణచివేతతోపాటు తమ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న అధికారులను హెచ్చరించడానికి లోకేశ్ రెడ్‌బుక్ రాస్తున్నట్లు చెప్పారు. తన యువగళం పాదయాత్రలో కార్యకర్తల వేదనను చూసి ఆ నిర్ణయం తీసుకున్నారు. కానీ, తెలంగాణలో కౌశిక్‌రెడ్డి సొంత వ్యవహారంలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదారు నెలలకే బ్లాక్‌బుక్ అంటూ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడం సరికాదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.బూడిద తరలింపులో జిల్లా మంత్రితో వచ్చిన గొడవను? పార్టీకి ఆపాదిస్తూ బ్లాక్ బుక్ రాయడానికి కౌశిక్ ఎవరనే చర్చ మొదలైంది. మరోవైపు కౌశిక్ రెడ్డి చేసిన ప్రకటనకు మద్దతుగా ఆ పార్టీలో ఏ నేత మాట్లాడటం లేదు. దీంతో కౌశిక్‌రెడ్డి బ్లాక్ బుక్ వ్యవహారంతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదనే వాదన వినిపిస్తోంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రులు సైతం?. కౌశిక్‌రెడ్డి, మంత్రి పొన్నం మధ్య వివాదాన్ని ఓ జిల్లా ఇష్యూగానే పరిగణిస్తున్నట్లు చెబుతున్నారు. అలాంటప్పుడు కౌశిక్‌రెడ్డి బ్లాక్‌బుక్‌కు ఏ మాత్రం సీరియస్‌నెస్ ఉండదనే అభిప్రాయమే వ్యక్తమవుతోంది. ఇలాంటి రాతలు, ప్రకటన వల్ల పార్టీ ఇమేజ్ మరింత డామేజ్ అయ్యే అవకాశం కూడా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.లోకేశ్‌తో తనను తాను పోల్చుకోవడం కౌశిక్‌రెడ్డికి అడ్వాంటేజ్ ఏమో గాని? బ్లాక్‌బుక్ వంటి ప్రకటనతో సీరియస్ అంశాన్ని నీరుగార్చే అవకాశం ఉంటుందని కొందరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి కౌశిక్‌రెడ్డి బ్లాక్‌బుక్ నిర్ణయం ఆవేశంగా తీసుకున్నదా? లేక పార్టీ పెద్దలతో నిర్ణయించిన తర్వాతే అలాంటి ప్రకటన చేయాల్సి వచ్చిందా? అన్నది తేలాల్సి వుంది. పార్టీ పరంగా విధాన నిర్ణయాలు తీసుకున్నప్పుడు అగ్ర నేతలో? పార్టీలో పెద్ద పదవుల్లో ఉన్న నేతలో ఇలాంటి ప్రకటన చేస్తే బాగుండేదని బీఆర్ఎస్ వర్గాల అభిప్రాయం. మరి ఇలాంటి పరిస్థితుల్లో కౌశిక్‌రెడ్డి బ్లాక్ బుక్ లో ఇంకా ఎవరెవరి పేర్లు రాస్తారు? ఈ బ్లాక్ బుక్ లో ఎక్కిన నేతలు, అధికారులపై ఎవరు చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. దీనికి గులాబీ పెద్దలు ఎలాంటి ముగింపు ఇస్తారో చూడాల్సివుంది.

# కాంగ్రెస్ ఖాతాలోకి నల్గొండ డీసీసీబీ



**నల్గొండ:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. డీసీసీబీ ఛైర్మన్ గొంగడి మహేందరరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఆయన పదవి కోల్పోవడంతోపాటు డీసీసీబీ ఛైర్మన్ వ్యవహారంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమ పార్టీకి చెందిన వారికి ముఖ్య పదవులను కట్టేబట్టే ఆలోచనల్లో ఆ పార్టీ నేతలు అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేలు గెలుచుకున్న కాంగ్రెస్.. డీసీసీబీ పీఠంపై కన్నేసింది. 2021 ఫిబ్రవరిలో జరిగిన నసహకార సంఘాల ఎన్నికల్లో గెలిచి ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు (డిసిసిబి) ఛైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్?గా గొంగిడి మహేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.డీసీసీబీలో మొత్తం 21 మంది డైరెక్టర్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 19 మందే ఉన్నారు. రిజర్వేషన్ల సభ్యులు లేకపోవడంతో మరో ఇద్దరిని నామినేట్ చేయలేదు. 19 మంది డైరెక్టర్లలో 18 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. మునుగోడు పీఏసీఎస్ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్. ఈ పదవిని తన అనుచరుడికి కట్టబెట్టాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భావించారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 9 మంది డిసిసిబి డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీబీని తన ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదిపింది. దీంతో ఈనెల 10వ తేదీన ఛైర్మన్ మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి 14 మంది డైరెక్టర్లు నోటీసులు ఇచ్చారు.డీసీసీబీ ఛైర్మన్ పదవిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆశిస్తున్నారు. 19 మందిలో 15 మంది డైరెక్టర్ల మద్దతు కూడగట్టిన శ్రీనివాస్ రెడ్డి క్యాంపుకు తీసుకెళ్లారు. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్ అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. 14 మంది డైరెక్టర్లు క్యాంపు నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చారు. అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్?కు ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో పాటు మరో ముగ్గురు బిఆర్ఎస్ డైరెక్టర్లు సమావేశానికి హాజరు కాలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా పదిమంది కాంగ్రెస్ డైరెక్టర్లతో పాటు బీఆర్ఎస్?కు చెందిన ఐదుగురు డైరెక్టర్లు కూడా మద్దతు ఇచ్చారు. దీంతో ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆయన డీసీసీబీ ఛైర్మన్ పదవిని కోల్పోయారు. ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో తాత్కాలిక ఛైర్మన్?గా బాధ్యతలను వైస్ ఛైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి చేపట్టారు.డీసీసీబీ నూతన ఛైర్మన్ ఎన్నికను జూన్ 1న నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఛైర్మన్ రేసులో ఉన్నారు. కుంభం శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో 15 మంది డైరెక్టర్లను 17 రోజులుగా క్యాంపు నిర్వహించి నేరుగా ఓటింగ్ పిలుచుకుని వచ్చారు. జూలై 1న జరిగే ఎన్నికలో కుంభం శ్రీనివాస్ రెడ్డి ఛైర్మన్?గా ఎన్నిక లాంచనం కానున్నట్లు తెలుస్తోంది. దీంతో నల్లగొండ డీసీసీబీ కాంగ్రెస్ ఖాతాలో వేసుకోనుంది.

# బీజేపీలో కనిపించని ఆపరేషన్ ఆకర్ష్




**హైదరాబాద్:** రాష్ట్రంలో ఆపరేషన్ ఆకర్ష్ తో కాంగ్రెస్ దూకుడు పెంచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని చేర్చుకుంటూ.. కాంగ్రెస్ పార్టీ బలం పెంచుకునే పనిలో పడింది. తెలంగాణలో 8 లోక్ సభ స్థానాలు గెలిచిన జోష్ లో ఉన్న బీజేపీ ప్లాన్ ఏంటీ ? కేంద్ర మంత్రిగా, రాష్ట్ర సారథిగా డ్యూయల్ రోల్ ప్లే చేస్తున్న కిషన్ రెడ్డి, రాష్ట్ర పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుంటారా ? కొత్త సారథి వచ్చే వరకు బీజేపీలో ఆపరేషన్ ఆకర్ష్ లేనట్టేనా..? అసలు బీజేపీ వైపు ఎవరైన ఎమ్మెల్యేలు చూస్తున్నారా..? చూస్తున్న వారికి వస్తోన్న అడ్డంకులేంటి ?తెలంగాణ బీజేపీలో మొన్నటి దాకా కేంద్రమంత్రి పదవి ఎవరికా అనే చర్చ జరిగితే ఇప్పుడు అదంతా కొత్త సారధి ఎవరా అనే దాని చుట్టు తిరుగుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డి, పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో బిజీ అయ్యారు. కేంద్రమంత్రిగా రెండో సారి బాధ్యతలు చేపట్టడమే కాకుండా కిషన్ రెడ్డికి జమ్మూకాశ్మీర్ పార్టీ ఎన్నికల ఇంఛార్జ్గా నియమించారు. దాదాపుగా 20 రోజుల పాటు రాష్ట్రానికి దూరంగా ఉండనున్నారు. రాష్ట్ర పార్టీ బాధ్యతల నుంచి తప్పించాలని ఇప్పటికే అధిష్టానానికి కిషన్ రెడ్డి విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీకి కొత్త సారథి నియామకం తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. త్వరలోనే బీజేపీ తెలంగాణ అధ్యక్ష నియామకం జరిగే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. టీబీజేపీ పగ్గాలు ఎవరికి చిక్కుతాయో అంతుచిక్కకపోవడంతో క్యాడర్‌లో స్తబ్ధత కనిపిస్తోంది. దానికి తోడుగా పార్టీలో పాత, కొత్త వివాదం కొనసాగుతోంది. పాత నేతలకే పార్టీ బాధ్యతలు అప్పగించాలని కొందరు డిమాండ్ చేస్తుండగా, కండువా కప్పుకున్న రోజు నుంచే పార్టీ కార్యకర్త అనే విషయాన్ని విస్మరించవద్దని మరికొందరు గుర్తు చేస్తున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని భావిస్తున్న కాషాయ దళానికి పార్టీలో నెలకొన్న స్తబ్ధత కొంత ఇబ్బందికరంగా మారింది. పార్టీ అధిష్టానం త్వరితగతిన నిర్ణయం ప్రకటిస్తే, లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో సత్తా చాటవచ్చని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ తో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకునేపనిలో పడింది. ఈ సందర్భంలో బీజేపీ ఏం చేయబోతుంది..? ఆపరేషన్ ఆకర్ష్ చేపడతారా ? లేదా ? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.స్థానిక సంస్థల ఎన్నికల నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ స్థానంలో నిలబడాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ పెట్టుకున్న టార్గెట్ అచీవ్ చేయడానికి ఇది క్లిష్ట సమయమనే చెప్పవచ్చు. లోక్ సభ ఎన్నికల్లో వచ్చిన 35 శాతం ఓట్లను కాపాడుకోవడం బీజేపీ ముందున్న సవాల్ . పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడానికి బీజేపీ సిద్ధాంతాలు, మోదీ నాయకత్వంపై నమ్మకమున్న వారు పార్టీలోకి వస్తే స్వాగతిస్తామని ఇప్పటికే రాష్ట్ర నేతలు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఐదారుగురు బీజేపీలోకి వస్తారని జోరుగా ప్రచారం కూడా సాగుతోంది. అయితే బీజేపీ ఫోకస్ మాత్రం ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ మీద లేదనే చెప్పాలి. కొత్త అధ్యక్షుడు వచ్చాక ఆయన చూసుకుంటారులే అన్నట్లు మిగతా నేతలు ఉన్నారు.కాంగ్రెస్‌లో చేరలేని పరిస్థితి ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు కాషాయ జెండా వైపు చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరాలంటే మాత్రం వారికి ఓ కండిషన్ అడ్డు వస్తోంది.

# తెలంగాణలో అంతా అమ్మదయానే



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సూపర్ పవర్‌పై పార్టీలో విస్తృత చర్చ జరుగుతోంది. ఇన్‌చార్జిగా పార్టీ వ్యవహారాలన్నీ ఆమె కనుసన్నల్లో జరుగుతున్నట్లే? ప్రభుత్వంలోనూ ఆమె జోక్యం చేసుకోవడంపై స్వపక్షం నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో నయా పవర్ సెంటర్‌గా మారిన దీప్‌దాస్ మున్షీ మెప్పు కోసం నేతలంతా పడరాని పాట్లు పడుతున్నారు. ఆమె అనుగ్రహం ఉంటే చాలు పనులన్ని ఇట్టే చక్క బెట్టుకోవచ్చని నేతలు పోటీ పడుతున్నారని చెబుతున్నారు.కాంగ్రెస్ సంప్రదాయం ప్రకారం పార్టీ హైకమాండ్ ప్రతీ రాష్ట్రానికి ఇన్‌చార్జ్‌లను, సహ ఇన్‌చార్జ్‌లను నియమిస్తుంటుంది. ఇలా నియమించిన ఇన్‌చార్జ్‌లే రాష్ట్ర వ్యవహారాలను పార్టీ అధిష్టానానికి చేరవేస్తుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే పార్టీ అధిష్టానానికి ఇన్‌చార్జులే కళ్లు, చెవులు అన్న మాట. ఇన్‌చార్జ్‌లు చెప్పిందే పార్టీ అధిష్టానం వద్ద చెల్లుబాటు అవుతుంది. అందుకే వారికి అంత ప్రియారిటీ ఉంటుంది. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో ఇన్‌చార్జి అధికారాలు చాలానే ఉంటాయి. పార్టీ వ్యవహారాల విషయంలో ఇన్‌చార్జ్ మాటకే ఎక్కువ విలువ ఉంటుందని టాక్. దీన్ని అదునుగా చేసుకొని తెలంగాణ ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షి చక్రం తిప్పుతున్నారని ప్రచారం జరుగుతోంది.రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వ పరంగా ఏ పని జరగాలన్నా ఇన్‌చార్జి అనుగ్రహం ఉంటే ఇట్టే జరిగిపోతున్నాయంటున్నారు. పార్టీలో తనకు అనుకూలంగా ఉన్న వారి పనులు చకచక జరిగేలా దీపాదాస్ మున్షీ సహకరిస్తున్నారని, ఆమెకు నచ్చకపోతే కొర్రీలు విధిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ఎంపికపైనా ఆమె జోక్యం చేసుకున్నారని తెలుస్తోంది. దీప్‌దాస్ మున్షీ మరో పవర్ సెంటర్‌గా మారుతున్నా, రాష్ట్రంలోని ముఖ్యనేతలు సైతం ఏమీ అనలేక మౌనంగా ఉండిపోతున్నారని చెబుతున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కొందరికి పట్టుబట్టి టికెట్లు ఇప్పించారంటే అధిష్టానంలో ఆమె పరపతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అంటున్నారు. ఇక ప్రభుత్వపరంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు సైతం దీపాదాస్ డీల్ చేసి, పరిష్కరించారని అంటున్నారు.వాస్తవానికి దీపాదాస్ మున్షికి తెలంగాణ ఇన్‌చార్జిగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించలేదు. కేరళ కాంగ్రెస్‌కు కూడా దీప్‌దాస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఇన్‌చార్జిగా మాణిక్‌రావు ఠాక్రేను తప్పించిన తర్వాత.. దీపాదాస్‌కు తెలంగాణ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆమె కేరళ రాష్ట్రాన్ని పట్టించుకోకుండా.. కేవలం తెలంగాణలోనే మకాం పెట్టారు. జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా ఇల్లు తీసుకొని ఇక్కడే ఉంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి వచ్చిన దీప్‌దాస్ మున్షి, ఇప్పుడు ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటుండటంతో పార్టీలోనే విమర్శలను ఎదుర్కొంటున్నారు.పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రభుత్వం నామినేట్ పోస్టులను భర్తీ చేయాలని భావించింది. ఆ విషయంలో దీప్‌దాస్ మున్షి జోక్యం చేసుకోవడం వల్ల పదవుల భర్తీ ఇప్పటికీ కొలిక్కి రాలేదంటున్నారు. కేబినేట్ విస్తరణ, పీసీసీ కొత్త అధ్యక్షుడి విషయంలో ఆమె ఆశీస్సులు ఉంటే పనవుతుందని? నేతలంతా ఆమె చుట్టే ప్రదర్శనలు చేస్తున్నారు.

# అప్పులా...ఆగండి... ఆగండి

**హైదరాబాద్, జూన్ :** పాలన గాడిలో పెట్టే పనిలో రేవంత్ సర్కార్ ఉంది. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉన్న అతి పెద్ద సమస్య రుణ మాఫీ. ఆ తర్వాత ఆరు హామీలు నెరవేర్చేందుకు సమకూరవలసిన డబ్బు. ఇవన్నీ పక్కనపెడితే గత పదేళ్లుగా బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కు తిప్పలుగా తయారవుతున్నాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో ఎక్కువ శాతం అప్పులు, జీతాల చెల్లింపులకే పోతోంది. కేసీఆర్ సర్కార్ చేసిన అప్పులకు నెల నెలా వడ్డీలు కట్టవలసిన దుస్థితి ఏర్పడింది. యావరేజ్ న చూస్తే రోజుకు రూ.207 కోట్లు కేవలం వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితిలో సంక్షే పథకాలను అమలు చేసేదెలా? అన్నదే రేవంత్ సర్కార్ ను వేధిస్తున్న సమస్య, రేవంత్ సర్కార్ కేలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగా అప్పులు ఇష్టారీతిన చేయొద్దనే నిర్ణయం తీసుకుంది. నెలకు కేవలం తెచ్చిన అప్పులకు కట్టే వడ్డీ రూ.6 వేల కోట్లకు పైగానే అని స్టేట్ ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అధికారులు చెబుతున్నారు. ఒక పక్క బీఆర్ఎస్ చేసిన అప్పులు ఎలాగోలా తిప్పలు పడి కడుతుంటే పదే పదే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ సర్కార్ ను రెచ్చగొట్టి ఇరుకున పెడుతున్నారు. రుణమాఫీ డెడ్ లైన్ అందులో భాగమే. ఇలాంటి డెడ్ లైన్స్ రెచ్చగొట్టి పెట్టించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఊపిరి సలపకుండా చేయడమే అని రాజకీయ విమర్శకులు సైతం బీఆర్ఎస్ ఎత్తుగడలను ఎండగడుతున్నారు. ఇప్పటి దాకా రేవంత్ సర్కార్ ప్రయోపయోగ నిర్మాణాలు, పథకాలు తదితర పనులకు గాను దాదాపు రూ.7 వేల కోట్ల మూలధన వ్యయంగా ఖర్చు చేసింది.గత సర్కార్ ఇష్టారీతిన చేసినట్లుగా గాక ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని రేవంత్ సర్కార్ రాష్ట్ర ఆర్థిక శాఖకు సూచనలు ఇచ్చారని తెలుస్తోంది. బడ్జెట్ లిమిట్స్ కు లోబడి మార్కెట్ రుణాలు తీసుకుని బడ్జెట్, ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానాన్ని రేవంత్ సర్కార్ పాటిస్తోంది. పైగా గతంతో పోలిస్తే ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే అప్పులు తగ్గుముఖం పట్టేలా చేశారు రేవంత్ . గతంతో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగినందున రుణాలు తీసుకునే పరిధి పెరిగింది. జీఎస్డీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం తక్కువ అప్పులు చేయటం కొత్త మార్పునకు సంకేతం. సాధారణంగా ప్రభుత్వాలు తాము చేసే రీపేమెంట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకుంటాయి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణం కంటే ఎక్కువ వడ్డీలు చెల్లించింది. తెచ్చిన అప్పుల కంటే తిరిగి చెల్లింపులు చేసింది ఎక్కువగా ఉండటం రేవంత్ సర్కారు ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పడుతోంది.గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో రూ.31 వేల కోట్ల రైతు రుణాల మాఫీకి ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర నిర్ణయం తీసుకుంది. మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసింది.

# టపాసుల ఫ్యాక్టరీలో పేలుడు

### నలుగురు మృతి....ఎనిమిది మందికి గాయాలు

**చెన్నై:** తమిళనాడు విరుధ్ నగర్ లో భారీ ప్రమాదం జరిగింది. టపాసుల ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. మరో 8 మందికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరణించిన తమవారిని చూసి కుటుంబ సభ్యులు కన్నీటిపర్యం అయ్యారు. ఆ కుటుంబ సభ్యులు కన్నీళ్లతో ఆ ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. టపాసుల మందు కలిపే క్రమంలో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణంపై విచారణ జరుపుతున్నారు. కాగా ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

======================

# రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

**చెన్నై:** తమిళనాడులోని మైలాదుత్తురై జిల్లా చిదంబరం-నాగపట్నం హైవేపై తాజాగా ఘోర ప్రమాదం జరిగింది. శ్రీధర్, శశికళ దంపతులు తమ రెండేళ్ల కుమారుడు భరత్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. చెన్నై నుంచి వేలంకన్నికి వెళ్తున్న కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాలుడితో సహా దంపతులు గాల్లోకి ఎగిరి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో శ్రీధర్, శశికళ చనిపోయారు. వారి కొడుకు భరత్ ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు.

=====================

# విజిలెన్స్ విచారణ జరిపించాలి

- **ఆదాల అంటే మోసం-నయ వంచన**
- **ఆదాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన మదన్ కుమార్ రెడ్డి**
- **దొంగ బిల్లు కాబట్టే. 67 కోట్ల బిల్లు నిలిపివేత**

**నెల్లూరు:** నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి నిర్వహిస్తున్న ఏపీఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి ,అప్పటి ప్రభుత్వ అండదండలతో అక్రమంగా సీఎఫ్ఎంఎస్ లో పొందుపరిచిన 67 కోట్ల బిల్లులకు సంబంధించి పేమెంట్ ను రాష్ట్ర ప్రభుత్వమే రద్దు చేసిందని, ఈ దొంగ బిల్లుకు సంబంధించిన దీనిపై సమగ్రంగా విజిలెన్స్ విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ నేత మదన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సాయంత్రం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఓ మోసగాడు, నయవంచకుడని విమర్శించారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం కార్యకర్తలను బలి చేశారన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై పోటీ చేయాలంటే తన 67 కోట్ల దొంగ బిల్లును మంజూరు చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేసినట్టు తెలుస్తుందన్నారు.

=====================

# 6,7,8,9 తరగతిలో ఖాళీ సీట్లకు ప్రవేశ పరీక్ష

**పత్తికొండ:** పత్తికొండ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతిలో ఖాళీ సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఉమా కుమారి తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల పాఠశాలలో పత్రికా విలేకరుల సమావేశంలో ఉమా కుమారి మాట్లాడుతూ6వ తరగతి ఎస్సీ -1, ఓసి -1, 7 ఏడో తరగతి బిసి-1, 8వ తరగతి ఎస్టి 1, 9వ తరగతి ఎస్సీ-1, బీసీ 1,ఓసిబి1, మొత్తం 6 సీట్లకు గాను 72 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. 69 మంది పరీక్ష రాశారని ,3 హాజరు కాలేదని తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

===========================

## ఎట్టకేలకు బోన్ లో చిక్కిన చిరుత...

**శిరివెళ్ల:** పచ్చర్ల గ్రామం చెక్ పోస్టు దగ్గర బోనులో చిరుత చిక్కింది. చిరుతను తిరుపతి జూకు తరలించే ఏర్పాట్లు ఫారెస్ట్ అధికారులు చేస్తున్నారు. నెల రోజులుగా పచ్చర్ల పరిసరాల్లో మనషుల పై చిరుత దాడి చేస్తుంది. చిరుతను బంధించడానికి అధికారులు అహర్నిశలు కృషి చేశారు. మేకను ఎరగా వేసి చిరుతను అధికారులు బోనులో బంధించారు. చిరుత పట్టుబడటంతో గ్రామస్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చిరుత వయస్సు 5 నుండి 6 సంవత్సరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం చిరుత ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

===========================

# కనికరం లేని కొడుకులకు, కోడళ్ళకు కౌన్సిలింగ్

**జగిత్యాల:** కన్న తల్లి,దండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులు ,కోడళ్లకు జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్ ఆదేశాల మేరకు ఏ.ఓ.తఫజుల్ హుస్సేన్,,సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ లు కౌన్సిలింగ్ నిర్వహించారు. సారంగపూర్ మండలం కొనాపూర్ కు చెందిన తల్లి పంగ రాజవ్వ,జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన పడాల గంగు,మోరపల్లి గ్రామానికి చెందిన సంపతి గంగయ్య,బీర్ పూర్ మండలం కమ్మునూర్ గ్రామానికి చెందిన తోట భూమరాజం, గొల్లపల్లి మండలం ఇబ్రాజ్ పల్లి గ్రామానికి చెందిన సంకటి రాజవ్వ లకు సంబంధించిన వయోవృద్ధుల పోషణ,రక్షణ చట్టం కింద ఇచ్చిన ఫిర్యాదుల కేసుల్లో కౌన్సిలింగ్ చేశారు.శనివారం ఆర్డీవో కార్యాలయం సమావేశ హాలులో జరిగిన కౌన్సెలింగ్ లో వయోవృద్ధుల చట్టం పై అవగాహన కల్పించి,తల్లిదండ్రులను పోషించక నిరాదరణకు గురిచేస్తే ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో 3 మాసాలకు పైగా జైలు శిక్ష,జరిమానా విధించే వీలు ఆ చట్టంలో ఉందని కౌన్సిలింగ్ చేశారు.ఈ కౌన్సి లింగ్ లో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,చట్టం సెక్షన్ సహాయకులు పద్మజ,ఫీల్డ్ ఆఫీసర్ కొండయ్య, కొడుకులు,కోడళ్లు,తల్లిదండ్రులు, పాల్గొన్నారు.


# పార్లమెంటరీ వ్యవస్థలు బాధ్యతగా పని చేస్తున్నాయా..!



2018లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం చేసిన ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 30 జూన్‌న ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ పార్లమెంటరిజమ్ దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ పార్లమెంటరిజమ్)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. ప్రజా సంక్షేమ కేంద్రాలు, చట్ట శాసన సభలుగా పార్లమెంటరీ వ్యవస్థలు చేస్తున్న అపార కృషికి స్పందనగా సాధారణ మానవాళి కృతజ్ఞతలు తెలియజేయడానికి ఈ వేదికలు ఉపకరిస్తున్నాయి. పార్లమెంటరీ వ్యవస్థలు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని కూడా సూచనలు చేయడం జరుగుతుంది. 30 జూన్ 1889న ఉద్భవించిన "ఇంటర్-పార్లమెంటరీ యూనియన్(ఐపియూ)" అంతర్జాతీయ సంఘ కృషికి గుర్తుగా 2018 నుంచి ప్రతి ఏట "అంతర్జాతీయ పార్లమెంటరిజమ్ దినం" నిర్వహించబడుతున్నది. 135 ఏండ్ల ఘన చరిత్ర కలిగిన ఐపియూలో 180 దేశాల పార్లమెంట్లకు చెందిన 46,000 మంది పార్లమెంటేరియన్లు సభ్యులుగా ఉండడం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు పార్లమెంటరీ వ్యవస్థలో సమాన అవకాశాలు కల్పించాలని కోరడం, ప్రజాస్వామ్య విలువలకు పట్టం కట్టడం, శాంతి నెలకొల్పడం, లింగ సమానత్వ సాధన, మానవ హక్కుల పరిరక్షణ, మైనారిటీ వర్గాల హక్కులు కాపాడడం, యువతకు చోటు ఇవ్వడం, దివ్యాంగులకు సముచిత స్థానం ఇవ్వడం, అవినీతి పాలకుల పంతం పట్టడం లాంటి పలు అంశాలను చర్చించే వేదికలుగా అంతర్జాతీయ పార్లమెంటరిజం దినం సమావేశాలు ఉపకరిస్తాయి. ఫ్రెంచ్ భాషలో 'పార్లర్' అనగా 'చర్చించడం (టు టాక్)' అని అర్థం. పార్లమెంటరీ ప్రజాస్వామ్య నియమాలను ప్రపంచ దేశాలు పాటించాలని సూచించడం జరుగుతున్నది. ప్రజాస్వామ్యానికి గుండెకాయలుగా పార్లమెంట్లు సేవలు అందించాలి. ప్రజల గొంతుకలుగా పార్లమెంట్లు పని చేయాలని, ప్రజాహిత నిర్ణయాలను నిష్పాక్షికంగా తీసుకోవాలని, అన్ని వర్గాల ప్రజల సమ్మిళిత సమగ్రాభివృద్ధికి ప్రతిన బూనడానికి వేదికలుగా పార్లమెంట్లు కృషి చేయాలని విశ్వ మానవాళి కోరుకుంటున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న మానవీయ విలువలు, జరుగుతున్న అరాచకాలు, ప్రజాందోళనలు, ప్రజాస్వామ్యానికి పడుతున్న తూట్లు, బడుగులకు ప్రాతినిధ్యం కొరవడడం, రాక్షస రాజకీయ క్రీడలు, స్వేచ్ఛా హక్కుకు తలుపులు మూయడం, చట్ట సభలు డబ్బునోళ్లకే చుట్టాలుగా మారడం, అశాంతి నెలకొన్న సమాజం లాంటి పలు సవాళ్ళ నడుమ నేటి పార్లమెంట్లు దారి తప్పుతూ ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కడం కొనసాగుతోంది. ప్రపంచ జనాభాలో 40 ఏండ్ల లోపు యువత 40 శాతం వరకు ఉన్నప్పటికీ పార్లమెంటరీ శాసన సభల్లో యువత ప్రాతినిధ్యం 17.5 శాతం మాత్రమే ఉన్నట్లు గణాంకాలు వివరిస్తున్నాయి. ప్రపంచ దేశాల్లోని దాదాపు 33 శాతం పార్లమెంట్లలో 30 ఏండ్ల లోపు యువత ప్రాతినిధ్యం లేకపోవడం ఒక ప్రమాదకర అంశంగా భావించాలి. చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం 20 - 30 శాతం వరకు కూడా ఉండడం లేదు. ప్రపంచవ్యాప్త పార్లమెంటరీ వ్యవస్థలో యువత గొంతులు, అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడమా కాకుండా నిర్ణయాధికారంలో యువత ఆలోచనలకు పట్టం కట్టాలని కోరుతున్నారు. అనాదిగా పౌరసమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల పరిష్కారానికి పార్లమెంట్లు కృషి చేయాలని, భవిష్యత్తు తరాలకు పటిష్ట బాటలు వేయాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని, సానుకూల వాతావరణంలో చట్టసభలు చర్చిసు జరపాలని సామాన్య జనం కోరుకోవడం కొనసాగుతూనే ఉంటున్నది. అంతర్జాతీయ పార్లమెంటరిజం దినం-2024 థీమ్‌గా "పార్లమెంటరీ దౌత్యం: శాంతి, అవగాహనలకు వారధుల నిర్మాణం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతోంది. పార్లమెంటరీ వ్యవస్థలు నిస్వార్థంగా పని చేస్తేనే ప్రపంచ మానవాళి సంక్షేమం, శాంతి స్థాపనలు కొనసాగుతాయని గమనించి పార్లమెంట్ సభ్యులు ప్రజా సేవకులుగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో కృషి చేయాలని ప్రజలు కోరుకుంటూ ఎదురు చూస్తున్నారు. భారత పార్లమెంటరీ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలుగా నిరక్షరాస్యత, పేదరికం, అనంత అవినీతి, లింగ వివక్ష, అసమానతల అగాధాలు, ఉగ్రవాదం, నిరుద్యోగం, ప్రాంతీయ వాదనలు, కులమత వివక్షలు/విబేధాలు, డ్రగ్స్ దుర్వినియోగాలు, మహిళలపై హింస, కోరలు చాస్తున్న కాలుష్యం లాంటి అంశాలు అనాదిగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య భారత పార్లమెంటరీ వ్యవస్థలో లోకసభ, రాజ్యసభలు పునాదులుగా నిలుస్తున్నాయి. మన పార్లమంట్‌లో మెజారిటీ పార్టీ నాయకుడిగా ప్రధానమంత్రి లోకసభలో నాయకత్వం వహించడం, రాజ్యసభలో సీనియర్ మంత్రిని సభా నాయకుడిగా పిఎం నియమించడంతో జరుగుతుంది. ఇప్పటి వరకు 18 సాధారణ ఎన్నికల ద్వారా పార్లమెంటు లోకసభ సభ్యులుగా ఎన్నికైనారు. మన పార్లమెంటరీ వ్యవస్థకు జవాబుదారుడిగా ప్రధానమంత్రి నిలుస్తున్నారు. 17వ పార్లమెంట్‌లోని రెండు సభల 776 ఎంపీల్లో 306 మంది (40 శాతానికి పైగా) ఎంపీలపై క్రిమినల్ కేసులు (మర్డర్లు, మానభంగాలు, కిడ్నాపులు, మహిళల పట్ల హింస లాంటి అభియోగాలు) నమోదు కాగా వాటిలో 194 (25 శాతం) మంది తీవ్రమైనవిగా గుర్తించారు. మన ఎంపీల సగటు ఆస్తులు 38 కోట్లుగా ఉండగా అందులో 53 మంది (అనగా 7 శాతం) బిలియనీర్లు ఉన్నారు. 2024లో నేడు కొలువు తీరిన 18వ లోకసభలో ఎంపికైన 543 మంది ఎంపీల్లో 251 మంది (46 శాతం) ఎంపీలపై క్రిమినల్ కేసులు, 31 శాతం ఎంపీలపై తీవ్రమైన ఆరోపణలు నమోదు అయ్యాయని తెలుస్తున్నది. దాదాపు సగం మంది పార్లమెంట్ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు కావడం, ధన బలం గెలుపును నిర్ణయించడం, కండబలం పార్లమెంటరీ స్ఫూర్తికి తూట్లు పొడవడం జరుగుతున్న నేపథ్యంలో భారత పార్లమెంట్ ప్రజల పక్షపాతిగా సేవలు అందిస్తుందనే విశ్వాసాన్ని కోల్పోవడం జరుగుతోంది. ప్రజాస్వామ్యం పరిహాసం పాలు కావడం, అధికారం స్వార్థ ప్రయోజనాలకు నెలవుగా మారడంతో పార్లమెంటరీ వ్యవస్థలపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోవడం ప్రమాదకర పరిణామంగా భావించాలి. పార్లమెంటరీ వ్యవస్థలు ప్రజాభిప్రాయాలకు పట్టం కట్టాలని, అసలైన నాయకులే ఎంపీలు, ఎంఎల్ఏలుగా ఎన్నిక కావాలని ఓటర్లు అభిప్రాయపడే రోజులు రావాలని కోరుకుందాం.

# పౌరాణిక చిత్రాల బ్రహ్మ....!

తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావు ది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్, పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసం లాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలి పోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం. కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసే వారు. విడుదలైన తెలుగు సినిమాలనుబీ న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలే గాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా వ్రాసేవారు. 1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బుక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి. ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని వ్రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని వ్రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయాన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మం లాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద వ్రాసిన విమర్శలే కామేశ్వర రావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల. మొదట్లో రచయితగా పని చేశారు. అదే సమయంలోనే కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు. వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు. బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్రరావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభా వంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే. కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు.ఆ తర్వాత తీసిన 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు. 1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'మహామంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫిస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమ్రోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరరావుకు మంచి పేరు తెచ్చుకుంది. కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్.వి.రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు. అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి. పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది.



ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు. 'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి. దర్శకుడిగా కమలాకర కామేశ్వరరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా.. ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి: పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

**సిద్దిపేట:** అధికారులకు సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎల్లప్పుడూ అండగా ఉంటాం. పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు కమిషనర్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోల కార్యక్రమం. సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు. మందాడి వెంకట సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పోలీస్ కంట్రోల్ రూమ్ సిద్దిపేట, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ నుండి ఇన్స్పెక్టర్ వరకు అంచలంచలుగా పదోన్నతి పొంది డిపార్ట్మెంట్లో 41 సంవత్సరాల సర్వేస్ పూర్తి చేసినారు. గడప సూర్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, సబ్ ఇన్స్పెక్టర్ గా అంచలంచలుగా పదోన్నతి పొందారు. డిపార్ట్మెంట్లో 40 సంవత్సరాల సర్వేస్ పూర్తి చేసినారు. గంట భూమయ్య, హెడ్ కానిస్టేబుల్, హుస్నాబాద్ పోలీస్ స్టేషన్, కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ పదవున్నది పొంది డిపార్ట్మెంట్లో 35 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను అభినందించి సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా 40 సంవత్సరాల సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు.



# భారతీయ గణాంకాల పితామహుడు...!


ప్రశాంత్ చంద్ర మహలనోబిస్ – భారతీయ శాస్త్రవేత్త, అనువర్తిత గణాంకశాస్త్రవేత్త. భారత ప్రణాళిక వ్యవస్థకు పితామహుడు జవహర్ లాల్ నెహ్రూ అయితే, భారత ప్రణాళిక పథానికి పి.సి.మహలనోబిస్ నిర్దేశకుడిగా ప్రసిద్ధిచెందాడు. అతను గణాంక కొలత అయిన "మహలనోబిస్ డిస్టెన్స్" ద్వారా గుర్తింపబడ్డాడు. ఆయన భారతదేశ మొదటి ప్లానింగ్ కమీషన్ సభ్యుడు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ను స్థాపించాడు. 1893లో కోల్కతలో జన్మించిన మహలనోబిస్ భౌతిక శాస్త్రంలో శిక్షణ పొంది, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్ గా రిటైరైనాడు. అతనికి గణాంక శాస్త్రంలో కల ఆసక్తి కారణంగా ఆ రంగంలో నైపుణ్యం సాధించి చివరికి ఆ రంగంలోనే జగత్ప్రసిద్ధి చెందినాడు. గణాంక శాస్త్ర రంగంలో అతని సేవలకు గుర్తింపుగా లండన్ లోని రాయల్ సొసైటీ పెల్లోగా ఎన్నికయ్యాడు. 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక శాస్త్ర కమిషన్ సభ్యుడిగా, 1949లో కేంద్ర మంత్రివర్గపు గణాంక శాస్త్ర గౌరవ సలహా దారుడిగా నియమించ బడ్డాడు. 1950లో నేషనల్ శాంపిల్ సర్వే స్థాపనలో మహలనోబిస్ కీలకపాత్ర వహించాడు. 1949 జాతీయాదాయ కమిటీ చైర్మెన్ గా మహలనోబిస్ జాతీయాదాయ గణాంకాలకు ప్రాతిపదిక స్వరూపాన్ని ఇచ్చాడు. 1955 నుండి 1967 వరకు ప్రణాళిక సంఘం సభ్యుడిగా తన సేవలందించాడు. రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో అతని కృషి అనిర్వచనీయం. భారీ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఆ ప్రణాళిక నమూనా మహలనోబిస్ నమూనా గా ప్రసిద్ధిగాంచింది. 1893 జూన్ 29 న కోల్కతలో జన్మించిన మహలనోబిస్ పూర్తి పేరు ప్రశాంత్ చంద్ర మహలనోబిస్. ఆయన పూర్వీకుల స్వస్థలం నేటి బంగ్లాదేశ్ ప్రాంతం. జీవనోపాధి కోసం మహలనోబిస్ తాత కోల్కత ప్రాంతానికి చేరి స్థిరపడ్డాడు. మహలనోబిస్ బాల్యం, విద్యాభ్యాసం కూడా కోల్కత లోనే కొనసాగింది. ప్రెసిడెన్సీ కళాశాలలో ఆయనకు జగదీష్ చంద్రబోస్, ప్రపుల్ల చంద్ర రే బోధించారు. 1912లో భౌతిక శాస్త్రం (ఆనర్స్) లో పట్టభద్రుడయ్యాడు. మహాలనోబిస్ 1913 లో లండన్ బయలుదేరి కేంబ్రిడ్జ్ లోని కింగ్స్ కాలేజీలో చేరాడు. గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం అభ్యసించాడు. గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ను విశ్వ విద్యాలయంలో కలిశాడు. అభ్యసనం పూర్తి కాగానే మహలనోబిస్ కోల్ కత లోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతిక శాస్త్ర అద్యాపకుడిగా ప్రవేశించాడు. 30 సంవత్సరాల పాటు సేవలందించి చివరగా ప్రిన్సిపాల్ గా రిటైరయ్యాడు. ప్రమథ నాథ్ బెనర్జీ (మింటో ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్), నిఖిల్ రంజన్ సేన్ (ఖైరా ప్రొఫెసర్ ఆఫ్ అప్లైడ్ మ్యాథమెటిక్స్) మరియు సర్ ఆర్ఎన్ ముఖర్జీలతో కలిసి, మహాలనోబిస్ 1932 లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ ను స్థాపించారు. ఆ సంస్థ 1959 లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ప్రకటించ బడింది. 1933లో భారత గణాంక శాస్త్ర పత్రిక సాంఖ్య ప్రచురణను ఆయన ప్రారంభించాడు. 1940 లలో శాంపిల్ సర్వే మీద అతను సాగించిన పరిశోధనల ఫలితంగా 1950లో నేషనల్ శాంపిల్ సర్వే స్థాపితమైంది. ప్రెసిడెన్సీ కళాశాల అద్యాపకుడిగా ఉన్నపుడే గణాంక శాస్త్రజుడిగా ప్రసిద్ధిచెందాడు. అతను గణాంక శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా 1945లో లండన్ లోని రాయల్ సొసైటీ ఫెలోగా ఎన్నికయ్యాడు. 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక కమిషన్ సభ్యుడిగా నియమించ బడ్డాడు. 1949లో కేంద్ర మంత్రివర్గపు గణాంక శాస్త్ర గౌరవ సలహాదారుడిగా నియమించ బడ్డాడు. దీనితో దేశానికి ఆర్థిక, గణాంక సేవలందించడానికి అవకాశం లభించింది. 1950 ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్ష ఉపన్యాసంలో జాతీయ ప్రణాళిక విధానంలో గణాంక శాస్త్రం అంతర్భాగం అని పేర్కొన్నాడు. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్) స్థాపనలో ప్రముఖ పాత్ర వహించాడు. స్థూల జాతీయోత్పత్తి, సంబంధిత ఇతర అంశాలను అంచనా వేయడం ఈ సంస్థ బాధ్యత. జాతీయాదాయ కమిటీ చైర్మెన్ గా మహలనోబిస్ జాతీయాదాయ లెక్కలకు ప్రాతిపదిక స్వరూపాన్ని రూపొందించాడు. సోవియట్ యూనియన్ ప్రణాళిక విధానానికి ప్రభావితుడైన జవహర్ లాల్ నెహ్రూ దేశంలో కూడా ఒక ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టు దశలో పి.సి.మహలనోబిస్ ప్రణాళిక విధాన రంగంలో ప్రవేశించాడు. 1950లో ప్రణాళిక సంఘం స్థాపితమైనప్పటి నుంచి గణాంక శాస్త్ర సలహాదారుడిగా సేవలందించాడు. 1955 నుండి 1967 ప్రణాళిక సంఘం సభ్యుడిగా నియమించ బడ్డాడు. ముఖ్యంగా భారీ పరిశ్రమలకు ప్రాముఖ్యం ఇచ్చిన రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో పి.సి.మహలనోబిస్ పాత్ర అనిర్వచనీయం. ఇది మహలనోబిస్ నమూనాగా ప్రసిద్ధి చెందినది. వర్తమాన ఆర్థిక వ్యవస్థకు ఉపయోగ కరమైన ప్రమాణాలను మహలనోబిస్ రెండో పంచవర్ష ప్రణాళికలో ప్రవేశ పెట్టాడు. ప్రణాళిక ఆలోచనలకు నిర్దిష్ట రూపం కల్పించడంలో మహలనోబిస్ ఎంతో సహకరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్కు కార్యదర్శిగా పనిచేశాడు. విశ్వ భారతి విశ్వ విద్యాలయంతో కూడా సంబంధం కలిగి ఉన్నాడు. 1944లో ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి వెల్డన్ మెడల్ పురస్కారం సొంతం చేసుకున్నాడు. 1945లో లండన్ లోని ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ సభ్యత్వం పొందాడు. 1957లో అంతర్జాతీయ గణాంక సంస్థ గౌరవ అధ్యక్షుడిగా హోదా పొందాడు. 1968లో భారత ప్రభుత్వము పద్మ విభూషణ్ పురస్కారం చే గౌరవించింది. భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన మహలనోబిస్ తన డెబ్బై తొమ్మిదవ పుట్టినరోజుకు ఒక రోజు ముందు, జూన్ 28, 1972 న మరణించాడు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మహాలనోబిస్ గౌరవార్థం జూన్ 29 ను జాతీయ గణాంక దినోత్సవంగా ప్రకటించారు.

# శివకుమార్‌ను సిఎంని చేయండి...!



**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అప్పగించాలని వొక్కలిగ సంఘం అధినేత కుమార చంద్రశేఖరనాథ్ స్వామి బహిరంగ వేదికపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరారు. ఇరువురు నేతల సమక్షంలో సంఘం నాయకుడు ఈ డిమాండ్ చేశారు. సిద్ధరామయ్యకు అధికారాన్ని రుచి చూసారని, శివకుమార్ ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని వేడుకున్నాడు. బెంగళూరుకు చెందిన శిల్పి కెంపగౌడ 515వ జయంతి వేడుకల సందర్భంగా ఈ వివాదాస్పద ప్రకటన చేశారు. కర్నాటకలోని వొక్కలిగ ఆధిపత్య సామాజికవర్గానికి చెందిన శివకుమార్ పై స్వామి చేసిన ప్రకటన కర్ణాటక కాంగ్రెస్‌ను ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇటీవల చన్నగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజు శివగంగ కూడా ఇదే డిమాండ్‌ను బహిరంగంగా లేవనెత్తారు. సంఘం నేత డిమాండ్‌పై సిద్ధరామయ్య స్పందిస్తూ దీనిపై కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. మరోపక్క సంస్థలపైనా, పరిపాలనపైనా శివకుమార్ నిర్ణయాత్మక ప్రభావం ఉందని సిద్ధరామయ్య పక్షం కలవరపడుతోంది. శివకుమార్‌తో పాటు ఇతర సామాజికవర్గ సభ్యులను పరిగణనలోకి తీసుకుని ఉప ముఖ్యమంత్రుల సంఖ్యను ఐదుకు తగ్గించాలని సిద్ధరామయ్య వర్గం సూచించింది. మే 2023లో బీజేపీని ఓడించి కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. రెండున్నరేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని పంచుకునే ఒప్పందంతో సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిని చేసిన విషయం విదితమే.

# మాల్దీవుల అధ్యక్షుడిపై చేతబడి.. ఇద్దరు మంత్రులు అరెస్ట్



మాల్దీవుల దేశంలో షాకింగ్ ఘటన ఒకటి వెలుగుచూసింది. ఏకంగా దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై చేతబడి చేయిస్తున్న ఇద్దరు మంత్రులు షమ్నాజ్ సలీమ్, ఆదం రమీజ్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. సీనియర్ మహిళా నేత షమ్నాజ్ సలీమ్ ప్రస్తుతం మాల్దీవుల పర్యావరణ శాఖ సహాయమంత్రిగా వ్యవహరిస్తున్నారు. షమ్నాజ్ సలీమ్ మాజీ భర్తే ఆదం రమీజ్. ఈయన కూడా ప్రస్తుతం మహ్మద్ ముయిజ్జు ప్రభుత్వంలో మంత్రి పదవిలోనే ఉన్నారు. చేతబడి చేస్తుండగా షమ్నాజ్ సలీమ్, మరో ఇద్దరు వ్యక్తులను మాల్దీవుల పోలీసులు గత ఆదివారం రాత్రి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాజాగా మంత్రి ఆదం రమీజ్‌ను కూడా అరెస్టు చేశారు. అరెస్టయిన నలుగురిని కోర్టులో ప్రవేశపెట్టగా వారం రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో షమ్నాజ్ సలీమ్, ఆమె మాజీ భర్త ఆదం రమీజ్‌లను మంత్రి పదవుల నుంచి తొలగించారు. కాగా, దేశ అధ్యక్షుడు కాకముందు మాలే నగర కౌన్సిల్ మేయర్‌గా ముయిజ్జు వ్యవహరించారు. ఆ సమయంలో ముయిజ్జుకు అత్యంత సన్నిహిత వ్యక్తులుగా షమ్నాజ్ సలీమ్, ఆదం రమీజ్‌లకు పేరు ఉండేది. ఆ సాన్నిహిత్యంతోనే ఇప్పుడు తన ప్రభుత్వంలో వారిద్దరికీ మంత్రి పదవులను ముయిజ్జు కేటాయించారు.

# పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్క నాయకులు పాల్గొనాలి

**- మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్ నాయుడు, వెంకటరాముడు చౌదరి**

**తుగ్గలి:** జులై 1వ తేదీన నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పరిధిలోని గల తెలుగుదేశం పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధికారులతో పాటు అట్టహాసంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుగ్గలి మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వెంకటరాముడు చౌదరి లు తెలియజేశారు. శనివారం రోజున విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు 4000 రూపాయలతో పాటు మూడు నెలలకు సంబంధించిన మూడువేల రూపాయల మొత్తంతో 7000 రూపాయలను అందజేస్తుందని వారు తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఒక్కొక్క హామీలను రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని వారు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వెలువడిన ఆదేశాల మేరకు కావున జూలై 1న జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పరిధిలోని గల తెలుగుదేశం పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులతో పాటు వెళ్లి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని వారు తెలియజేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తామని వారు తెలియజేశారు.

# తెలంగాణ తెలుగు మహిళలకు చింతమనేని ఆత్మీయ సత్కారం

**దెందులూరు:** గడచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దెందులూరు నియోజకవర్గంలో జరిగిన చింతమనేని ప్రభాకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని పార్టీ గెలుపు కోసం కృషి చేసిన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన "తెలంగాణ తెలుగు మహిళల బృందం" శనివారం ఉదయం దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు తెలంగాణ తెలుగు మహిళలు బృందం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కృషి చేసిన, ఖమ్మం జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు మందపల్లి రజనీ సహా తెలుగు మహిళా విభాగం నాయకులు కామా అనిత, పల్లగాని రమ్య, మోదేపల్లి రమాదేవి, వెలగపూడి విజయలక్ష్మి తదితర తెలుగు మహిళలకు పుట్టింటి కానుకను తలపించేలా పసుపు కుంకుమ, చీర వంటివి అందించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వారిని ఘనంగా సత్కరించారు. ఎన్నికల వేళ తనకోసం ఎంతో కృషి చేసిన ప్రతి తెలుగు మహిళకు ఒక అన్నలాగా ఎల్లపుడూ అండగా ఉంటాను అని, అభిమానానికి రాష్ట్ర సరిహద్దులు అడ్డుగోడలు కాలేవు అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు బొప్పన సుధా, నంబూరి నాగరాజు, మాగంటి మిల్లు బాబు, లావేటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు మోతుకురి నాని, ఎ౦బొ౦ఈ అధ్యక్షులు పెనుబొయిన మహేష్ యాదవ్ సహా పలువురు సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు గ్రామ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ వర్సెస్ బైడెన్.. బిగ్ డిబేట్ ఎలా జరిగిందంటే...?

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు లైవ్ డిబేట్ లో పాల్గొన్నారు. ఇరువురు నేతల మధ్య చర్చ వాడీవేడిగా సాగింది. 2020 అధ్యక్ష ఎన్నికల గందరగోళం తర్వాత వీరిద్దరూ తొలిసారి ముఖాముఖి తలపడ్డారు. అట్లాంటాలో సీఎన్ఎన్ ప్రధాన కార్యాలయంలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 90 నిమిషాల పాటు ఈ కార్యక్రమం జరిగింది. ద్రవ్యోల్బణం, ఉద్యోగాల కల్పన విషయంలో బైడెన్ పై ట్రంప్ విరుచుకుపడ్డారు. ట్రంప్ హయాంలో అనుసరించిన ఆర్థిక విధానాలపై విమర్శలు గుప్పిస్తూ బైడెన్ చర్చను ప్రారంభించారు. ధనవంతులపై ట్రంప్ అనుకూల వైఖరి చూపడంతోనే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్నారు. ఉద్యోగ కల్పన పూర్తిగా క్షీణించిందన్నారు. నిరుద్యోగం 15 శాతానికి చేరిందన్నారు. ఇలాంటి సమయంలో ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించాల్సిన బాధ్యతను ప్రజలు తనపైన పెట్టినట్లు పేర్కొన్నారు. బైడెన్ హయాంలోనే అక్రమ వలసదారులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఆయనపై ట్రంప్ విరుచుకుపడ్డారు. ద్రవ్యోల్బణం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పన్ను కోతల వల్ల ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని ట్రంప్ విమర్శలు గుప్పించారు. అఫ్గాన్ నుంచి అమెరికా బలగాల




ఉపసంహరణ ఘోరంగా విఫలమైందని బైడెన్ పై విరుచుకుపడ్డారు. అఫ్గాన్ పౌరులను తాలిబన్లు చంపుతూనే ఉన్నారని కానీ ట్రంప్ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అక్కడ చనిపోయిన సైనికులను ట్రంప్ దూషించారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరాక్‌లో పనిచేసి తర్వాత మరణించిన తన కుమారుడు బ్యూను బైడెన్ గుర్తుచేసుకున్నారు. మరోవైపు ఉక్రెయిన్–రష్యా గురించి మాట్లాడుతూ.. పుతిన్‌కు ట్రంప్ పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. పైగా అనేకమంది సైనికుల ప్రాణాలు కోల్పోయినందునే రష్యా ప్రతిదాడి చేస్తోందని సమర్థించారని ఆరోపించారు. ఈ ఆరోపణలను ట్రంప్ ఖండించారు.

# 'థాంక్యూ సర్' అన్నందుకు విమానం ఎక్కనీయలేదు..!




**శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా) :** విమానంలో మహిళా సిబ్బందిని ఓ ప్రయాణీకురాలు పొరపాటున పురుషుడిగా భావించి 'థాంక్యూ సర్' అని అంది. అంతే వెంటనే ఆ ప్రయాణీకురాలిని విమానం నుండి కిందికి దించేశారు! తరువాత పొరపాటు తెలుసుకొని క్షమాపణలు కోరినా కానీ ఆ మహిళా సిబ్బంది సదరు ప్రయాణీకురాలి తల్లిని బిడ్డను కూడా విమానంలో ఎక్కనీయలేదు. ఈ ఘటన యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో చోటుచేసుకుంది. ఈ విషయం బాధితురాలు సోషల్ మీడియా వేదికగా పంచుకొని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఆస్టిన్ బయలుదేరేందుకు విమానం సిద్ధమైంది. టెక్సాస్‌కు చెందిన జెన్నా లాంగోరియా తన కుమారుడు, తల్లితో విమానం ఎక్కే సమయంలో సిబ్బంది బోర్డింగ్ పాస్‌ను అందించారు. దీంతో మహిళా అటెండెంట్‌ను పొరపాటుగా పురుషునిగా భావించి.. 'థాంక్యూ సర్' అని కృతజ్ఞతలు తెలిపింది. దీంతో ఆమె మండిపడి ప్రయాణికురాలి ఆమె తల్లిని, బిడ్డను విమానంలోనికి వెళ్లకుండా ఆపేసింది. అదే సమయంలో జెన్నా మరో మేల్ ఫ్లైట్ అటెండెంట్ సాయం కోరింది. తన తల్లి, కుమారుడిని ఆయన గేట్ వద్ద ఆపేశారని ఫిర్యాదు చేసింది. దీంతో ఆ మేల్ ఫ్లైట్ అటెండెంట్.. ఆ సిబ్బంది 'ఆయన' కాదు 'ఆమె' అని బదులిచ్చారు. తన తప్పును తెలుసుకుని ఆ మహిళా సిబ్బందికి క్షమాపణలు చెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోకపోగా.. విమానం నుంచి దింపేశారని సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది!

# బీర్ తాగండి కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోండి.....



ఈ రోజుల్లో అన్ని రకాల పార్టీలలో కచ్చితంగా మందు విందు ఉండాల్సిందే. అసలు విందుకైనా కాంప్రమైజ్ అవుతారేమో కానీ మందుకు మాత్రం తగ్గేదే లేదు అంటారు. ఆల్కహాల్‌లో చాలా వెరైటీస్ ఉంటాయి. అందులో బీర్ ఒకటి. ఒకప్పుడు కేవలం మగవారు మాత్రమే తాగేవారు. కానీ ఇప్పుడు మీకు మేము దేనిలో తక్కువ కాదంటూ ఆడవాళ్లు కూడా బాటీళ్లు బాటీళ్లు లాగించేస్తుంటారు. అయితే ఈ బీర్ తాగడం వల్ల కలిగే నష్టాల గురించి తరచూ వింటూనే ఉంటాం. కానీ, బీర్ తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుందనే విషయం ఇప్పుడు ఓ పరిశోధనలో తేలింది. అసలు అది ఎలా జరుగుతుంది.. ఇది నిజంగా నిజమేనా.. అన్నది ఇప్పుడు మనం ఇక్కడ తెలుసుకుందాం.. ఆల్కహాల్‌లో బీర్ ఎక్కువగా వినియోగించబడే మద్యం. ఇది ఇతర హార్డ్ మద్యం కంటే తక్కువ ఆల్కహాల్ కలిగి ఉంటుంది. అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. విటమిన్ బి, ప్రోటీన్, ఫైబర్ వంటి కొన్ని పోషకాలు బీరులో ఉంటాయి. ఒక పరిశోధన ప్రకారం, పరిమిత పరిమాణంలో బీర్ తీసుకుంటే అది కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. బీర్‌లో 125 కేలరీలు మాత్రమే ఉన్నాయి. బీర్ శరీరంలో ఎల్‌డిఎల్‌కు బదులుగా హెచ్‌డిఎల్ స్థాయిని పెంచుతుంది. ఇది సిరలను ఆరోగ్యంగా ఉంచుతుంది. బీర్‌లో ఫోలిక్ యాసిడ్‌తో సహా బి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇది గుండెపోటును నివారించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ పేషెంట్లు బీర్లు ఎక్కువగా తాగితే శరీరంలో ఇన్సులిన్ స్థాయి క్షీణించే అవకాశం ఉంది. ఇంకా బీర్ ఇతర ఆరోగ్య ప్రయోజనాలు పరిశీలించినట్లయితే, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో, మధుమేహం నియంత్రణ, మూత్రపిండాల్లో రాళ్లను నివారించడం నుండి కొలెస్ట్రాల్, రక్తంలో గడ్డలు వంటివి తగ్గించడం చేస్తుంది. ఇది జీర్ణక్రియ, బోలు ఎముకల వ్యాధి, ఎముకల వ్యాధి, ఎముకల ఆరోగ్యం, అధిక రక్తపోటుకు కూడా సహాయపడుతుంది. బీర్‌లో హిమోగ్లోబిన్‌ను నిర్వహించడానికి, రక్తహీనత చికిత్సకు సహాయపడే విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇది గుండెను రక్షిస్తుంది. వివిధ హృదయ సంబంధ వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. బీర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో కరిగే ఫైబర్ ఉంటుంది. బీర్లు ఎక్కువగా తీసుకుంటే ఫ్యాటీ లివర్, లివర్ సిర్రోసిస్ వంటి వ్యాధులు రావచ్చు. బీర్ అనేది మాల్టెడ్ బార్లీ, గోధుమలు లేదా మొక్కజొన్నతో తయారు చేస్తారు. ఇది బ్రూయింగ్ ప్రక్రియలో పులియబెట్టి తయారుచేస్తారు. దీనిని లిక్విడ్ బ్రెడ్ అని కూడా పిలుస్తారు. దీనిని పానీయంగా కాకుండా ఆహారంగా పరిగణిస్తారు. బీర్ వినియోగం ప్రతికూల ఆరోగ్య పరిణామాలను కలిగి ఉన్నప్పటికీ, అధికంగా తీసుకోవడం వల్ల వాటిలో బ్లడ్ షుగర్ అసమతుల్యత, ఆల్కహాల్ డిపెండెన్స్, డిప్రెషన్, లివర్ సమస్యలు, క్యాన్సర్ లేదా అకాల మరణం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

# తుమ్మును ఆపుకోవడం ఎంత ప్రమాదమో తెలుసా!



తుమ్ములు అనారోగ్యం బారిన పడకుండా చేస్తుంది: తుమ్ము అనేది నిజానికి శరీరంలోకి ప్రవేశించిన బ్యాక్టీరియా, దుమ్ము, ధూళి, పుప్పొడి, పొగ, కాలుష్యం మొదలైన వాటి వల్ల కలిగే ప్రతిచర్య.దీని కారణంగా మీరు మీ ముక్కు దగ్గర కొద్దిగా తిమ్మిరి, అసౌకర్యంగా భావిస్తారు. అలాంటప్పుడు మీరు తుమ్ముతారు. ఈ చర్య అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు. క్రిములు, కణాల వల్ల శరీరం దెబ్బతినకుండా తుమ్ములు కాపాడతాయని చెప్పారు. తుమ్మును ఆపడం అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందని, కొన్నిసార్లు ప్రమాదకరంగా కూడా మారుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది: నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు తుమ్మినప్పుడు గంటకు 100 మైళ్ల వేగంతో మీ ముక్కు నుండి శ్లేష్మం చుక్కలు బయటకు వస్తాయి. ఇది శ్వాసకోశ వ్యవస్థపై ఉంచే ఒత్తిడి కారణంగా, ఇది శక్తివంతమైన చర్యగా మారుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, ఒక స్త్రీ తుమ్మినప్పుడు ఆమె శ్వాసకోశంలోని చదరపు అంగుళానికి కనీసం ఒక పౌండ్ శక్తిని ప్రయోగిస్తుంది. కానీ దానిని ఆపడం వల్ల శ్వాసకోశ వ్యవస్థలో ఒత్తిడి 5-24 సార్లు పెరుగుతుంది. దీని వల్ల అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. పక్కటెముక గాయం: అదే సమయంలో చాలా మంది తుమ్మినప్పుడు వారి పక్కటెముకలు నొప్పి ప్రారంభమవుతుంది. అయితే, ఈ రకమైన ఆలోచన ముఖ్యంగా వృద్ధులలో కనిపిస్తుంది. నిజానికి అలాంటిదేమీ లేదు. ఊపిరితిత్తులలోకి అధిక పీడన గాలి చేరడం వల్ల ఎముకల సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది. ఛాతీ కండరాలు తుమ్మును ఆపడం వల్ల డయాఫ్రాగమ్ దెబ్బతినే ప్రమాదం ఉంది. తుమ్మును ఆపినపుడు గాలి ఛాతీ కండరాలలోకి వెళుతుంది. ఫలితంగా డయాఫ్రాగమ్ దెబ్బతింటుంది. దీనివల్ల విపరీతమైన నొప్పి వస్తుంది. ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా మారుతుంది. మెదడుపై ప్రభావం: మీరు తుమ్మును అణిచివేసినట్లయితే, ఆ ఒత్తిడి మీ శరీరంపై పడుతుంది. దీని వల్ల మెదడు పగిలిపోయేంత ఇబ్బంది కలుగుతుంది. ఇది జరిగితే, మెదడు చుట్టూ ఉన్న ప్రాంతంలో రక్తస్రావం ప్రారంభమవుతుంది. గొంతు నష్టం: తుమ్మును ఆపడం వల్ల గొంతు వెనుక భాగంలో ఒత్తిడి వస్తుంది. ఫలితంగా, ఆ భాగం నలిగిపోతుంది. నొప్పి, వాపు వంటి సమస్యలు మొదలవుతాయి. అందువల్ల, మీ తుమ్ములను వీలైనంత వరకు ఆపకుండా ప్రయత్నించండి. తుమ్ముల వల్ల వచ్చే అలర్జీ సమస్య పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుని సరైన ఆహారం తీసుకోవాలి. చెవులు కూడా ప్రభావితమవుతాయి: తుమ్మును ఆపడం వల్ల మీ కర్ణభేరి పగిలిపోతుంది. తుమ్మును ఆపేటప్పుడు మీరు మీ ముక్కును నొక్కితే, అది ముఖంపై ఒత్తిడిని కలిగిస్తుంది. ఈ పీడనం యుస్టాచియన్ ట్యూబ్ ద్వారా మీ మధ్య చెవిలోకి ప్రయాణిస్తుంది.. ఇది చెవిపోటు, కర్ణబేరి పగిలిపోయే అవకాశం ఉంది.

# మొలకలొచ్చిన వెల్లుల్లిపాయలు తింటే



వెల్లుల్లి తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే మనలో చాలా మంది వెల్లుల్లిని తింటూ ఉంటారు. అయితే వెల్లుల్లి పాయ మొలక వస్తే మాత్రం పారేస్తూ ఉంటాం. వీటిలో కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

ఈ విషయం తెలియక చాలామంది మొలక వచ్చిన వెల్లుల్లిని పారేస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు చెప్పే విషయాలను తెలుసుకుంటే అస్సలు పారేయరు. ఇలా మొలక వచ్చిన వెల్లుల్లిపాయలో మామూలు వెల్లుల్లిపాయలో కన్నా ఎక్కువ గుండెకు మేలు చేసే యాంటీ ఆక్సిడెంట్స్ క్రియాశీలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. లేత పాయలు, కాస్త ముదిరిన పాయలతో పోలిస్తే మొలక వచ్చిన పాయలలో రకరకాల మెటాబోలెట్స్ అధికంగా ఉంటాయి.


సాధారణంగా ఈ మెటాబోలెట్స్ గింజల మొలకల్లో కనిపిస్తాయి. మొక్కలుగా మారే దశలో ఆయా మొలకలు వ్యాధుల బారిన పడకుండా ఈ మెటాబోలెట్స్ కాపాడతాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ గా అద్భుతంగా పనిచేస్తాయి. మామూలు వెల్లుల్లి పాయలు కన్నా మొలక వచ్చిన వెల్లుల్లి గుండెకు మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్, బిపి ను తగ్గించడంలో సహాయ పడతాయి. రోగనిరోధక శక్తిని పెంచి క్యాన్సర్ రాకుండా నిరోధిస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కూడా ఇలా తీసుకోవడం చాలా మంచిది. కాబట్టి మొలక వచ్చిన వెల్లుల్లిని తిని ఇప్పుడు చెప్పిన ప్రయోజనాలను పొందండి.

# రోగ నిరోధక శక్తిని పెంచే ఫుడ్స్..!




రోగ నిరోధక శక్తి గురించి ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతుంది. ఇమ్యూనిటీ ఉన్నప్పుడే జలుబు, దగ్గు, ఫీవర్ తోపాటు అనేక రోగాలను శరీరం ఎదుర్కొంటుంది. లేదంటే మనిషి వ్యాధితో మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అందుకే ఇమ్యూనిటీ ఇంపార్టెంట్ అని చెప్తారు నిపుణులు. రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు తీసుకోవాల్సి ఆహారం గురించి వివరిస్తున్నారు. పాలకూర: విటమిన్ ఎ, సి, ఇ లతో కూడిన పాలకూర.. రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఫ్రీరాడికల్స్ తో పోరాడే యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంది. ఐరన్, మెగ్నీషియం మూలంగా ఉన్న ఈ ఆకు కూర.. సంపూర్ణ ఆరోగ్యానికి మద్దతిస్తుంది. బాదం: బాదం విటమిన్ ఇ గొప్ప మూలం. కాగా ఆరోగ్యకరమైన ఫ్యాట్స్, ఫైబర్, ప్రోటీన్స్ కలిగి ఉంటుంది. శక్తి స్థాయిలను పెంచి ఆరోగ్య నిర్వహణకు హెల్ప్ అవుతుంది. పసుపు: పసుపులోని యాంటీ ఇన్ ఫ్లమెటరీ పదార్థం కర్కుమిన్ ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కలిగిన పసుపు.. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.అల్లం: అల్లం యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమెటరీ లక్షణాలు కలిగి ఉంటుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. వికారం తగ్గిస్తుంది. హానికారకమైన వ్యాధికారక క్రిములతో పోరాడటం, వాపును తగ్గించడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వెల్లుల్లి: వెల్లుల్లిలోని అల్లిసిన్ ఇమ్యునిటీ పవర్ పెంచేందుకు ప్రసిద్ధి చెందింది. ఇది రోగ నిరోధక ప్రతిస్పందనను పెంచుతుంది. రక్తపోటు తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పెరుగు: పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. పేగు ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ప్రోటీన్, కాల్షియం, విటమిన్ డి మూలంగా ఉన్న ఇది పూర్తి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. పసుపు: పసుపులోని యాంటీ ఇన్ ఫ్లమెటరీ పదార్థం కర్కుమిన్ ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది.

# 60 శాతం మంది భారతీయులు బద్ధకస్తులే...!



ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఎలాంటి వ్యాధులు దరిచేరవని పలు అధ్యయనాలు రుజువు చేశాయి. మినిమమ్ వర్క్ అవుట్ మస్ట్ అని నిపుణులు కూడా సూచిస్తున్నారు. కానీ జనాల్లో మాత్రం మార్పు రాలేదని మెడికల్ జర్నల్ ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురించబడిన అధ్యయనం తెలిపింది. ముఖ్యంగా ఇండియన్స్ సగానికి సగం మంది అంటే ప్రతి ఇద్దరికి ఒకరు కూడా అచీవ్ చేయలేకపోయారని గుర్తించింది. 2030 నాటికి భారతదేశంలో సిఫార్సు చేయబడిన శారీరక శ్రమ స్థాయిని అందుకోని వారి నిష్పత్తి 59.9%కి చేరుతుందని అంచనా వేయబడింది. ఇదే పరిస్థితి కంటిన్యూ అయితే గుండెపోటు, స్ట్రోక్, టైప్ 2 డయాబెటిస్, చిత్తవైకల్యం, రొమ్ము క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యాయామం చేయని వారి నిష్పత్తి 31%గా ఉండగా.. భారతదేశంలో 49.4%, పాకిస్తాన్‌లో 45.7%. భూటాన్‌లో 9.9% నేపాల్‌లో 8.2% ఉంది. అధిక ఆదాయం కలిగిన ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వర్క్ ఔట్ చేయని వారు 48% ఉండగా.. దక్షిణాసియాలో 45% ఉన్నారు. ఇక 2010 నుంచి 2022 మధ్యకాలంలోనే వ్యాయామం ప్రాధాన్యత గురించి అవగాహన పెరిగినా.. దాన్ని ఫాలో అవడంలో మాత్రం నిర్లక్ష్యం వహించారు. దీంతో ఫిజికల్ ఎక్సర్సైజ్ చేసే వారి సంఖ్య ఐదు శాతం తగ్గింది.ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఎలాంటి వ్యాధులు దరిచేరవని పలు అధ్యయనాలు రుజువు చేశాయి. మినిమమ్ వర్క్ అవుట్ మస్ట్ అని నిపుణులు కూడా సూచిస్తున్నారు. కానీ జనాల్లో మాత్రం మార్పు రాలేదని మెడికల్ జర్నల్ ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురించబడిన అధ్యయనం తెలిపింది. ముఖ్యంగా ఇండియన్స్ సగానికి సగం మంది అంటే ప్రతి ఇద్దరికి ఒకరు కూడా అచీవ్ చేయలేకపోయారని గుర్తించింది.

# రోజూ కాఫీ తీసుకుంటే 60% ఎక్కువ రోజులు బతికేయొచ్చు...



సాధారణంగా ఆఫీస్ లో ఆరు గంటల కంటే ఎక్కువ సేపు కూర్చుని వర్క్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రిలీఫ్ కోసం కొందరు ఎంప్లాయీస్ కాఫీ తీసుకుంటారు. మరికొందరు మాత్రం దానికి దూరంగా ఉంటారు.

అది బ్యాడ్ హ్యాబిట్ అని ఫీల్ అయిపోతారు. కానీ నిజానికి కాఫీ తాగడమే ప్రాణాలను కాపాడుతుందని చెప్తుంది తాజా అధ్యయనం. 13ఏళ్లుగా 10000 మంది కంటే ఎక్కువ మందిపై నిర్వహించిన ఈ స్టడీ.. కాఫీ తాగని వారితో పోలిస్తే తాగే వారు జీవించే అవకాశం 60 శాతం ఎక్కువగా ఉందని తెలిపింది. అంటే రోజూ కాఫీ తాగడం వల్ల మరణాల ముప్పు 60 శాతం తగ్గుతుందని వెల్లడించింది.

చలనం లేకుండా గంటల కొద్ది కూర్చోవడం పలు అనారోగ్య ప్రమాదాలతో ముడిపడి ఉందని ఇప్పటికే పలు అధ్యయనాలు రుజువు చేశాయి. కాగా అలాంటి హెల్త్ రిస్క్ నుంచి కాఫీ కాపాడుతుందని తాజా అధ్యయనం వివరిస్తుంది. కాఫీలో కెఫిన్, పాలీఫెనాల్స్ వంటి యాంటీ ఇన్ఫ్లమేటరీ కాంపౌండ్స్.. మంటను తీవ్రతరం చేసే జీర్ణక్రియ సమస్యను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదం నుంచి కాపాడుతాయి.

# ఉపవాసంతో క్యాన్సర్‌కు చెక్.....

సాధారణంగా చాలా మంది వారానికి ఒకసారో, రెండు సార్లో ఉపవాసం చేస్తుంటారు. ఇది శతాబ్దాలుగా అనేక సంస్కృతులు, మతాలలో ప్రధానమైనది. ఎవరి మతానికి సంబంధించిన వారి పద్ధతుల్లో ఆ దేవుడిని ఉపవాస దీక్షలు చేస్తారు. అయితే.. ఈ ఉపవాసం పుణ్యంతో పాటు ఆరోగ్యాన్ని కూడా ఇస్తుందని కొందరు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉపవాసం బరువు తగ్గడానికి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదే విధంగా ఒత్తిడిని తగ్గంచి రక్తపోటును నియంత్రిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. వీటితో పాటు తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. వారంలో రెండు సార్లు ఉపవాసం ఉండటం వల్ల క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. ఉపవాసం వల్ల శరీరంలోని క్యాన్సర్ కణాలను ఎదుర్కోవడానికి అవసరమైన రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇక వారానికి రెండు రోజులు ఉపవాసం చేస్తే క్యాన్సర్ కణాలకు



వ్యతిరేకంగా పోరాడటానికి సహాయపడుతుందని పరిశోధకులు తెలిపారు. న్యూయార్క్‌లోని మెమోరియల్ స్లోన్ కెట్టెరింగ్ క్యాన్సర్ సెంటర్ చేసిన రీసెర్చ్‌లో ఈ విషయం వెల్లడైంది. ఎలుకలపై నిర్వహించిన ఈ అధ్యయనంలో.. వారానికి రెండు సార్లు ఉపవాసం పాటించడం వల్ల శరీరంలోని క్యాన్సర్ కణాలను ఎదుర్కోవడానికి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుందని తేలింది.


# చిరిగిన జీన్స్‌తో కూడా వామికా గబ్బి యొక్క బ్లాక్ బాడీసూట్ పార్టీ అంతా రాసి



వామికా గబ్బి ఫ్యాషన్ నిచ్చెన ఎక్కుతోంది మరియు నోట్స్ రాసుకోవడానికి వేము పెన్ను మరియు కాగితం కోసం వెతుకుతున్నాము. నటి తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో చూసినట్లుగా తన కచేరీలకు కొత్త చిక్ ఫిట్‌ను జోడించింది. స్ట్రీట్-స్టైల్ ఫ్యాషన్‌పై తనకున్న పట్టును ప్రదర్శిస్తూ, వామికా నలుపు రంగులో ఉండే టాప్ మరియు డిస్ట్రెస్డ్ ఫేడెడ్ బ్లూ జీన్స్‌ని ఎంచుకుంది. అమర్చిన బస్టియర్ డెకోలేటేజ్-రివీలింగ్ ప్లంగింగ్ నెక్‌లైన్‌తో వచ్చింది. బాడీస్ అంతటా నడుస్తున్న ప్లీటెడ్ ప్యాటర్న్‌లు ఓంఫ్ కోటీన్‌ను ఎలివేట్ చేశాయి. వామికా టాప్ యొక్క బ్యాక్‌లెస్ ఎలిమెంట్ ద్వారా కొంత రిస్క్‌ను చల్లాడు. మరియు, అది కూడా, పూర్తి విశ్వాసంతో. అన్‌బటన్ లేని జీన్స్‌పై వెడల్పాటి మోకాలి కటౌట్‌లు సాధారణం ప్రకాశంతో ఒక ఎడ్జీ ఫ్యాక్టర్‌ను అల్లాయి. పచ్చి మరియు సహజమైన ప్రకంపనలకు అనుగుణంగా, వామికా యాక్సెసరీలను ధరించడం మానేశాడు. డ్యూయి-బ్లేటెడ్ బుగ్గలు, నగ్న పెదవులు మరియు మాస్కరా-పూతతో కూడిన విస్ప్ కొరడా దెబ్బలు మైనస్ మరియు కాజల్ తన క్లీన్ గర్ల్ బ్యూటీ స్ట్రోక్‌లను గుండ్రంగా చేసింది. వామికా యొక్క తియ్యని గోధుమ రంగు వస్త్రాలు అద్భుతమైన అలలలో తెరవబడి ఉన్నాయి. 2024 GQ 35 మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ యంగ్ ఇండియన్స్ అవార్డ్స్‌లో, కనికా గోయల్ లేబుల్ నుండి తన బేసిక్-చిక్ అవతార్ ద్వారా వామికా గబ్బి మాకు మాటలు లేకుండా చేసింది. ఆమె డీప్-స్కూప్డ్ నెక్‌లైన్‌తో కూడిన లేటెక్స్ ఆఫ్-వైట్ ట్యాంక్ టాప్ ధరించడం ప్రారంభించింది. ఫిగర్-హగ్గింగ్ బస్టియర్‌పై మెటాలిక్ షైన్ వేసవి సూర్యుడి కంటే ప్రకాశవంతంగా మెరుస్తోంది. ముదురు గోధుమ రంగు లెదర్ ప్యాంట్‌లోకి జారడం ద్వారా వామికా తన OOTDకి అద్భుతమైన వ్యత్యాసాన్ని అందించింది. రోజీ-కాంటౌర్డ్ బుగ్గలు, నిగనిగలాడే పీచు-లేతరంగు పెదవులు మరియు మాస్కరాతో నిండిన పొడవాటి కనురెప్పలతో కూడిన మట్టి-టోన్ మేకప్ ఆమె రూపాన్ని మరింత మెరుగుపరిచింది. ఉపకరణాలు మిస్ చేయబడ్డాయి మరియు వామికా తడి గ్రంజ్ హెయిర్‌డోతో ఆమె మంత్రముగ్ధులను చేసే అవతార్‌ను మూసివేసింది, ఆమె తాళాలు పొడవుగా ఉన్నాయి. దీనికి ముందు, వనీకా గబ్బి ఫ్యాషన్ డిజైనర్ నికితా కరిజ్మాకు మ్యూజ్‌గా నటించింది. ఆమె స్ఫుటమైన కాలర్ ఉన్న తెల్లటి చొక్కా మీద వాలింది మరియు చుట్టిన చేతులతో ధరించింది. ఆమె బాడీలో కట్టబడిన నిర్మాణాత్మక కార్సెట్ టాప్ రెట్రో వైబ్‌ని అందించింది. బిగించిన బస్టియర్‌పై మార్బుల్-డైడ్ బ్లాక్ అండ్ వైట్ అబ్‌స్ట్రాక్ట్ ప్రింట్లు దూరంగా నుండి చిక్‌గా అరిచాయి. నడుముపై సూక్ష్మమైన ఎంబ్రాయిడరీని కలిగి ఉన్న ఒక జత బ్యాగీ బ్లాక్ ప్యాంటును ధరించడం ద్వారా వామికా తన ఫ్యాషన్ కోవను సమం చేసింది. వామికా గబ్బి ఫ్యాషన్ పోలీసుల మంచి పుస్తకాలలో తన పేరును సరిగ్గా పొందుపరిచింది.

## చిక్కుల్లో ఆవేశం స్టార్..!

### ఫహద్ ఫాసిల్‌పై కేసు నమోదు చేసిన కేరళ మానవహక్కుల సంఘం..!



మలయాళ స్టార్ నటుడు ఫవాద్ ఫాసిల్ చిక్కుల్లో పడ్డారు. ఆయనపై కేరళ మానవ హక్కుల సంఘం ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేసింది. ఇందుకు కారణం ఉన్నది. ఫవాద్ ఫాసిల్ ప్రస్తుతం 'పింకేలీ' మూవీని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా మూవీ షూటింగ్‌ను ఎర్నాకులంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారని.. దాంతో రోగులు ఇబ్బందులకు గురైనట్లు తెలుస్తున్నది. రాత్రి సమయంలో షూటింగ్ జరిగిందని.. ఎమర్జెన్సీ వార్డులో షూటింగ్ చేసినట్లు తెలుస్తున్నది. ఈ వ్యవహారంపై మానవ హక్కుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమర్జెనీ రూమ్‌లో షూటింగ్‌కు ఎలా అనుమతి ఇచ్చారంటూ కమిషన్ సభ్యురాలు బీనా కుమారి వైద్యులపై ఫైర్ అయ్యారు. ఈ మేరకు వైద్యులను వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తున్నది. షూటింగ్ సమయంలో ప్రమాదకర పరిస్థితిలో ఉన్న వారిని సైతం ఆసుపత్రి లోపలికి తీసుకువెళ్లనివ్వలేదని ఆరోపణలు రాగా.. నిర్మాత సంఘం ఖండించింది. అయితే, షూటింగ్ వ్యవహారంపై సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం 'పింకెలి' మూవీని నిర్మిస్తున్న ఫహద్ ఫాసిల్‌పై కేసు నమోదైంది. ఫావాద్ ఫాసిల్ హీరో, విలన్ పాత్రతో సంబంధం లేకుండా తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తెలుగులోనూ పలు సినిమాల్లో చేసినా.. 'పుష్ప'లో భన్వర్ షింగ్ షెకావత్ అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించి అదరగొట్టేశాడు. ప్రస్తుతం పుష్ప-2 లోనూ నటిస్తున్నారు. ఇటీవల ఫహద్ 'ఆవేశం' మూవీతో తెలుగు అభిమానులను పలకరించాడు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.100కోట్లకుపైగా కలెక్షన్‌ను రాబట్టింది. ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు ఫవాద్ ఫాసిల్ నిర్మాతగానూ పలు సినిమాలను నిర్మిస్తున్నారు.

## మళ్లీ సినిమాల మీద ఫోకస్ చేస్తున్న కంగనా



ఎన్నికల హడావిడి ముగియటంతో మళ్లీ ల మీద ఫోకస్ చేశారు కంగనా రనౌత్. తను స్వయంగా డైరెక్ట్ చేసిన కాంట్రవర్షియల్ మూవీ ఎమర్జెన్సీ రిలీజ్ డేట్‌ను లాక్ చేశారు.అంతేకాదు ఆ తరువాత చేయబోయే ల విషయంలోనూ క్లారిటీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. బాలీవుడ్ కాంట్రవర్షియల్ బ్యూటీ కంగనా రనౌత్ మళ్లీ ఫిలిం సర్కిల్స్‌లో ట్రెండ్ అవుతున్నారు. నిన్న మొన్నటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్న ఈ బ్యూటీ, తిరిగి ఫోకస్‌ను ల మీదకు షిఫ్ట్ చేశారు.ఎన్నికల హడావిడి ముగియటంతో మళ్లీ ల మీద ఫోకస్ చేశారు కంగనా రనౌత్. తను స్వయంగా డైరెక్ట్ చేసిన కాంట్రవర్షియల్ మూవీ ఎమర్జెన్సీ రిలీజ్ డేట్‌ను లాక్ చేశారు. అంతేకాదు ఆ తరువాత చేయబోయే ల విషయంలోనూ క్లారిటీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. బాలీవుడ్ కాంట్రవర్షియల్ బ్యూటీ కంగనా రనౌత్ మళ్లీ ఫిలిం సర్కిల్స్‌లో ట్రెండ్ అవుతున్నారు. నిన్న మొన్నటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్న ఈ బ్యూటీ, తిరిగి ఫోకస్‌ను ల మీదకు షిఫ్ట్ చేశారు. ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఎమర్జెన్సీ ను సెప్టెంబర్ 6న రిలీజ్ చేస్తున్నట్టుగా వెల్లడించారు. యాక్చువల్‌గా ఎమర్జెన్సీ ఎన్నికలకు ముందే రిలీజ్ కావల్సి ఉంది. ఆ ప్లాన్‌తోనే ప్రాజెక్ట్‌ను సిద్ధం చేశారు.కానీ ఎందుకు మనసు మార్చుకున్నారో తెలియదు గానీ రిలీజ్ వాయిదా వేశారు. ఇప్పుడు ఎంపీగా గెలిచిన తరువాత ఎమర్జెన్సీని ఆడియన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ అవుతున్నారు. ఈ తో పాటు ఆల్రెడీ ఎనౌన్స్ అయిన మిగతా ప్రాజెక్ట్స్ మీద కూడా ఫోకస్ చేస్తున్నారు క్వీన్. సీత ది ఇన్‌కార్నేషన్ పేరుతో మైథలాజికల్ మూవీని ఎనౌన్స్ చేశారు కంగనా. నిన్న మొన్నటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్న ఈ బ్యూటీ, తిరిగి ఫోకస్‌ను ల మీదకు షిఫ్ట్ చేశారు.ఎన్నికల హడావిడి ముగియటంతో మళ్లీ ల మీద ఫోకస్ చేశారు కంగనా రనౌత్. తను స్వయంగా డైరెక్ట్ చేసిన కాంట్రవర్షియల్ మూవీ ఎమర్జెన్సీ రిలీజ్ డేట్‌ను లాక్ చేశారు. అంతేకాదు ఆ తరువాత చేయబోయే ల విషయంలోనూ క్లారిటీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు.

## కల్కి 2898 ఏడీ మూవీపై రజనీకాంత్ ప్రశంసలు..!

### ఇండియన్ మూవీని మరో లెవల్‌కు తీసుకెళ్లారంటూ..!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం కల్కి 2898 ఏడీ మూవీ. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నది. ఇప్పటికే ఈ మూవీని చూసిన పలువురు సెలబ్రిటీలు స్పందించారు. ఈ మూవీ భారత సినిమాను మరో మెట్టు ఎక్కించిందంటూ ప్రశంసిస్తున్నారు. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ సైతం చిత్ర బృందంపై ప్రశంసలు కురిపించారు. కల్కి మూవీని చూశానని రజనీకాంత్ తెలిపారు. సినిమా ఎంతో అద్భుతంగా ఉందంటూ అభినందించారు. భారతీయ చిత్రాన్ని డైరెక్టర్ నాగ్ అశ్విన్ మరో స్థాయికి తీసుకెళ్లారంటూ ప్రశంసలు కురిపించారు. చిత్రం భారీ హిట్ సాధించినందుకు బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, హీరో ప్రభాస్, కమల్ హాసన్, హీరోయిన్ దీపికా పదుకొనేతో పాటు చిత్రబృందానికి రజనీ అభినందనలు తెలిపారు. అలాగే, సెకండ్ పార్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానన్నారు. ఇదిలా ఉండగా.. కల్కి 2898 ఏడీ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ప్రీ బిజినెస్‌లో రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' మూవీ రికార్డులు బద్దలుకొట్టింది. ఈ మూవీ తొలిరోజు దాదాపు రూ.191.9కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. వారాంతం కావడంతో రెండురోజులు కలెక్షన్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. కల్కి పార్ట్-2 ఉండబోతుందని మూవీ క్లైమాక్స్‌లో వెల్లడించారు. పార్ట్-1 ఈ రేంజ్‌లో ఉంటే.. పార్ట్-2 మరో రేంజ్‌లో ఉంటుందని అంచనా వేస్తున్నారు.




# 12 ఏళ్ల కనిష్టానికి బ్యాంకుల మొండిబాకీలు




న్యూఢిల్లీ: మనదేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, బ్యాంకింగ్ సిస్టమ్ నిలకడగా ఉందని ఆర్‌బీఐ ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్ (ఎఫ్ఎస్ఆర్) పేర్కొంది. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల గ్రాస్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (జీఎన్‌పీఏ) రేషియో (మొత్తం అప్పుల్లో జీఎన్‌పీఏల వాటా) ఈ ఏడాది మార్చి నాటికి 12 ఏళ్ల కనిష్టమైన 2.8 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 2.5 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. నెట్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్ఎన్‌పీఏ) రేషియో 0.6 శాతానికి దిగొచ్చిందని పేర్కొంది. కిందటి ఆర్థిక సంవత్సరంలోని చివరి ఆరు నెలల్లో ప్రభుత్వ బ్యాంకుల గ్రాస్ ఎన్‌పీఏల రేషియో 0.76 శాతం తగ్గిందని తెలిపింది. బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్ మెరుగుపడుతోందని, ఫైనాన్షియల్ సంస్థలు ఇస్తున్న అప్పులు పెరుగుతున్నాయని ఆర్‌బీఐ ఎఫ్ఎస్ఆర్ పేర్కొంది. బ్యాంకుల క్యాపిటల్ టు రిస్క్ వెయిటెడ్ రేషియో (సీఆర్ఏఆర్– క్యాపిటల్ అడెక్వసీ రేషియో) 16.8 శాతంగా ఉందని, కామన్ ఈక్విటీ టైర్ 1 (సీఈటీ1) రేషియో 13.9 శాతంగా ఉందని ఎఫ్ఎస్ఆర్ వివరించింది. ఎన్‌పీఏలుగా మారే అసెట్స్‌తో బ్యాంకుల దగ్గరున్న క్యాపిటల్‌ను పోల్చడానికి సీఆర్ఏఆర్ సాయపడుతుంది. బ్యాంకుల ఆస్తులను వీటి క్యాపిటల్‌తో పోల్చడానికి సీఈటీ1 రేషియో సాయపడుతుంది. ఆర్‌బీఐ పెట్టుకున్న సీఆర్ఏఆర్ టార్గెట్స్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి చేరుకుంటామని ఎఫ్ఎస్ఆర్ వెల్లడించింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) ఆర్థిక పరిస్థితులు మెరుగవుతున్నాయని, వీటి సీఆర్ఏఆర్ ఈ ఏడాది మార్చి నాటికి 26.6 శాతంగా, జీఎన్‌పీఏ రేషియో 4.0 శాతంగా ఉన్నాయని వివరించింది. గ్లోబల్‌గా సమస్యలు ఉండడంతో రిస్కులు లేకపోలేదని ఆర్‌బీఐ ఎఫ్ఎస్ఆర్ రిపోర్ట్ పేర్కొంది. అయినప్పటికీ గ్లోబల్ ఫైనాన్షియల్ సిస్టమ్ నిలకడగా ఉందని తెలిపింది. ఫైనాన్షియల్ సిస్టమ్‌ను కొత్త టెక్నాలజీలు ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్ సిస్టమ్‌లో స్టెబిలిటీ ఉందని, కానీ ఇక్కడి నుంచి ఈ వ్యవస్థ మెరుగుపడాలంటే అంత ఈజీ కాదని అన్నారు. కొత్త టెక్నాలజీలతో కస్టమర్ల ఎక్స్‌పీరియెన్స్ మెరుగుపడుతుందని, అలానే ఫైనాన్షియల్ సిస్టమ్‌లో ఇవి వేగంగా విస్తరించడం వలన సమస్యలు కూడా నెలకొంటాయని అన్నారు. బ్యాంకులు, సంస్థలు, ఇతర స్టేక్‌హోల్డర్లు టెక్నాలజీని సరిగ్గా వాడుకోవడానికి సరిపడినంత ఇన్వెస్ట్ చేయాలని, సెక్యూరిటీని బలపరుచుకోవాలని సూచించారు. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల గ్రాస్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (జీఎన్‌పీఏ) రేషియో (మొత్తం అప్పుల్లో జీఎన్‌పీఏల వాటా) ఈ ఏడాది మార్చి నాటికి 12 ఏళ్ల కనిష్టమైన 2.8 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 2.5 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. నెట్ నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్ఎన్‌పీఏ) రేషియో 0.6 శాతానికి దిగొచ్చిందని పేర్కొంది. కిందటి ఆర్థిక సంవత్సరంలోని చివరి ఆరు నెలల్లో ప్రభుత్వ బ్యాంకుల గ్రాస్ ఎన్‌పీఏల రేషియో 0.76 శాతం తగ్గిందని తెలిపింది. ఆర్‌బీఐ పెట్టుకున్న సీఆర్ఏఆర్ టార్గెట్స్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి చేరుకుంటామని ఎఫ్ఎస్ఆర్ వెల్లడించింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) ఆర్థిక పరిస్థితులు మెరుగవుతున్నాయని, వీటి సీఆర్ఏఆర్ ఈ ఏడాది మార్చి నాటికి 26.6 శాతంగా, జీఎన్‌పీఏ రేషియో 4.0 శాతంగా ఉన్నాయని వివరించింది.

## 'ప్రాథమిక పన్ను మినహాయింపును రూ.3.5 లక్షలకు పెంచాలి'



కేంద్రం త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పన్ను విధానానికి సంబంధించి స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.1 లక్షకు పెంచాలని ఫైనాన్షియల్ కన్సల్టెన్సీ సంస్థ ఈవై డిజి ఇండియా తెలిపింది. ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని రూ.3.5 లక్షలకు పెంచాలని కోరింది. ఈవై తెలిపిన వివరాల ప్రకారం..ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి విధాన పరమైన ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించాలి. పన్ను విధానాలను క్రమబద్ధీకరించాలి. దేశీయంగా పెట్టుబడులు ఆకర్షించే వాతావరణాన్ని పెంపొందించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. కార్పొరేట్ పన్ను రేట్లను స్థిరంగా కొనసాగించాలి. టీడీఎస్ నిబంధనను మార్చాలి. వివాద పరిష్కారాలను సరళీకరించాలి. పన్ను మినహాయింపులు లేని కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలి. రాయితీ పన్ను విధానంలో ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుంచి రూ.1 లక్షకు పెంచాలి. ప్రాథమిక మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు చేర్చాలి. ఐటీఆర్ ప్రాసెస్ చేయడంలో పన్ను చెల్లింపుదారులు నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దాన్ని మెరుగుపరిచేలా సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) సేవలు వినియోగించుకోవాలి. 'టీడీఎస్‌ను హేతుబద్ధీకరించాలి. ప్రస్తుతం టీడీఎస్ కింద 33 విభాగాలు ఉ?న్నాయి. దాంతో పన్నుదారుల్లో చాలా గందరగోళం నెలకొంటుంది. వీటిలో 0.1 నుంచి 30 శాతం వరకు పన్ను రేట్లు ఉంటాయి. ఇందులోని విధానాలను సరళీకరించాలి' అని ఈవై కన్సల్టెన్సీ కోరింది.

## వివాహితులకు 'నోజాబ్' అంటూ ఫాక్స్‌కాన్‌పై ప్రచారం




వివాహితులకు 'నోజాబ్' అంటూ జరుగుతున్న ప్రచారంపై ఐఫోన్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ ఖండించింది. తాము నియమించుకున్న ఉద్యోగుల్లో 25 తం మంది వివాహుతలైన మహిళలే ఉన్నారని స్పష్టం చేసింది. తమిళనాడులోని చెన్నై కేంద్రంగా ఫాక్స్‌కాన్ సంస్థ ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్‌లను తయారు చేస్తుంది. అయితే ఇటీవల ఐఫోన్ తయారీ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌లో మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కానీ దీనిపై ప్రచారం మరోలా జరిగినట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ యాజమాన్యం వివాహితులైన మహిళల్ని నియమించుకోవడం లేదనే పుకార్లు షికార్లు చేశాయి. ఈ ప్రచారంతో అప్రమత్తమైన కేంద్రం ఫాక్స్‌కాన్‌లో జరిగిన నియామకాలపై వెంటనే తమకు సమగ్ర సమాచారాన్ని అందించాలని తమిళనాడు కార్మిక శాఖకు ఆదేశాలు జారీచేసింది. ఉద్యోగుల నియామకంపై ఫాక్స్‌కాన్ వివరణ ఇచ్చినట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కథనాలు ఆధారంగా తమ ఐఫోన్ తయారీ ప్లాంట్‌లో కొత్తగా ఉద్యోగుల నియామకం జరిగిందని, వారిలో 25 శాతం మంది వివాహిత మహిళలేనని ఫాక్స్‌కాన్ ప్రతినిధులు చెప్పారు. ఉద్యోగం రాలేదని అసత్య ప్రచారం చేశారని, ఇలాంటి నిరాధారమైన ప్రచారంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ తయారీ రంగాన్ని దెబ్బతీస్తున్నాయని వారు తెలిపారు. ఇదిలా ఉంటే, ఫాక్స్ కాన్ ప్లాంట్‌లో పని చేయడానికి వివాహిత మహిళలను అనుమతించకపోవడంపై పలు మీడియా సంస్థలు (అందులో పీటీఐ) ఆరా తీయగా ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో ప్రస్తుతం 70 శాతం మంది మహిళలు, 30 శాతం మంది పురుషులు ఉన్నారు. తమిళనాడు ప్లాంట్ దేశంలో మహిళలు అత్యధికంగా ఉపాధి పొందుతున్న మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌గా పేరు సంపాదించింది. ఇందులో ప్రస్తుతం ఉపాధి పొందుతున్న సిబ్బంది సంఖ్య 45,000 దాటినట్లు ఫాక్స్‌కాన్ ప్రతినిధులు వెల్లడించారు.

## వినియోగదారులకు షాక్ ఇచ్చిన జియో..




ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో తమ రీచార్జి టారీఫ్‌లను పెంచనున్నట్లు ప్రకటించింది. ఒక్కో ప్లాన్ పై కనిష్ఠంగా 12.5 శాతం నుంచి గరిష్ఠంగా 25 శాతం వరకు పెంచనున్నట్లు జియో ప్రకటించింది. దీంతోపాటు కొత్త రీఛార్జి ప్లాన్లను తెచ్చింది. కొత్త టారీఫ్ అమలు నుంచి రోజుకు 2 జీబీ కంటే ఎక్కువ డేటా ఇచ్చే ప్లాన్లలో మాత్రమే అపరిమిత 5జీ డేటా సౌకర్యం ఉంటుంది. ఈ కొత్త ధరలు జూలై 3 నుంచి అమల్లోకి వస్తాయి. జియో సేఫ్ క్వాంటం సెక్యూర్: ఇది కాలింగ్, మెసేజ్, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్ తో పాటు కమ్యూనికేషన్ సదుపాయాలు అందించే యాప్. నెలకు రూ.199 చెల్లించి ఈ సర్వీసులను పొందవచ్చు. జియో ట్రాన్స్‌లేట్– ఏఐ: ఈ యాప్ వాయిస్ కాల్, వాయిస్ మెసేజ్, టెక్స్ట్, ఇమేజ్‌లోని సమాచారాన్ని కృత్రిమ మేథ (ఏఐ)తో అనువాదం చేస్తుంది. నెలకు రూ.99 చెల్లిస్తే ఈ యాప్ సేవలు పొందవచ్చు. జియో యూజర్లకు ఈ రెండు సర్వీసులను ఏడాది పాటు ఉచితంగా జియో అందిస్తుంది. దేశంలో 2జీ నెట్‌వర్క్‌కు పరిమితమైన వారు ఇంకా 250 మిలియన్ల మంది ఉన్నారు. వారు డిజిటల్ సేవలను వినియోగించుకోవడం లేదని జియో తెలిపింది. వీరిని కొత్త తరం వైపుగా తీసుకచ్చేందుకు 4జీ సదుపాయంతో జియో భారత్, జియో ఫోన్లను తీసుకొచ్చినట్లు తెలిపింది. 'ట్రూ5జీ ఇప్పుడు అత్యంత వేగవంతమైన నెట్‌వర్క్. దేశంలో సొంతంగా 5జీ నెట్‌వర్క్ అందిస్తున్న టెలికాం సంస్థ మాదే. ప్రస్తుతం భారత్‌లో ఉన్న 5జీ మొబైల్స్‌లో 85 శాతం జియోతో పని చేస్తున్నవే' అని సంస్థ స్పష్టం చేసింది.

## భారత్‌లోనే విలువైన బ్రాండ్....!

భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌ల్లో టాటా గ్రూప్ టాప్‌లో నిలిచింది. ఈ మేరకు బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన విలువైన బ్రాండ్ ర్యాంకింగ్స్ టైటిల్‌ను టాటా గ్రూప్ దక్కించుకుంది. డిజిటలైజేషన్, ఈ–కామర్స్, ఈవీ, ఎలక్ట్రానిక్స్..వంటి రంగాలపై దృష్టి సారించిన ఈ సంస్థ బ్రాండ్ విలువ గతంలో కంటే 9 శాతం పెరిగి 28.6 బిలియన్ డాలర్ల(రూ.2.3 లక్షల కోట్లు)కు చేరుకుంది. గతేడాది ఈ టైటిల్‌కు దక్కించుకున్న టాటా గ్రూప్ ఈసారీ తన స్థానాన్ని నిలుపుకుంది. బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక ప్రకారం..దేశంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా టాటా గ్రూప్ టాప్‌లో నిలిచింది. 14.2 బిలియన్ డాలర్ల(రూ.1.18 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో ఇన్ఫోసిస్ రెండో స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ మూడో స్థానం (రూ.86 వేలకోట్లు) సాధించింది. గతేడాదిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం అవ్వడంతో ఈ స్థానం దక్కింది. ఎల్‌ఐసీ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ గ్రూప్, ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, లార్సెన్ & టూబ్రో, మహీంద్రా బ్రాండ్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బ్రాండ్ ఫైనాన్స్ డైరెక్టర్ సావియో డిసౌజా మాట్లాడుతూ..'టాటా గ్రూప్ దాని అనుబంధ సంస్థల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగిస్తోంది. వ్యూహాత్మకంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) స్పాన్సర్‌షిప్‌లు, ఎయిరిండియా వంటి కంపెనీ వాటాను సొంతం




చేసుకుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న రిటైల్ డొమైన్‌లో ప్రత్యేకత చాటుకుంటోంది. దాంతో కంపెనీ వినియోగదారులకు మరింత చేరువైంది. భారత్‌లోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా స్థానం సంపాదించింది' అని చెప్పారు. రంగాల వారీగా చూస్తే టెలికాం రంగం తన బ్రాండ్ విలువలో గతంలో కంటే 61 శాతం వృద్ధి సాధించింది. బ్యాంకింగ్ 26 శాతం, మైనింగ్, ఇనుము, ఉక్కు రంగాలు 16 శాతం చొప్పున వృద్ధి నమోదు చేశాయి. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రాండ్‌లలో వెస్ట్‌సైడ్ బ్రాండ్(టాటా గ్రూప్– 122 శాతం వృద్ధి) అగ్రస్థానంలో ఉంది.


## జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు...



జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మాక్సిల్) డైరెక్టర్ జనరల్ ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీనియర్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్నతో కలిసి ఉదరు భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ.. 2023 నుంచి 2029 వరకు ఈ రంగంలో 10 బిలియన్ డాలర్లు (రూ.83వేల కోట్లు) రెవెన్యూకు అవకాశాలున్నాయన్నారు. ఇందుకు 15 కీలక ఔషధాలు మద్దతును అందించనున్నాయని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–మేలో భారత ఔషధ ఎగుమతులు 8.85 శాతం పెరిగి రూ.4.73 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. గతేడాది ఇదే రెండు నెలల్లో 4.35 బిలియన్ల ఎగుమతులు జరిగాయన్నారు. దేశంలో 748 యూనిట్లకు యుఎస్ఎఫ్‌డిఎ అనుమతులు ఉన్నాయని తెలిపారు. 2004–05లో 3.9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఔషధ ఎగుమతులు.. 2023–24 నాటికి 27.85 బిలియన (రూ.2.32 లక్షల కోట్లు)కు చేరాయన్నారు. ఈ కాలంలో ప్రతీ ఏడాది సగటున 11 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 31 బిలియన్ డాలర్ల (రూ.2.58 లక్షల కోట్లు)కు చేరొచ్చని ఉదరు అంచనా వేశారు. కాగా.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలపై భారత ఫార్మా కంపెనీలు కీలక దృష్టిని సారించాయన్నారు. ఫార్మెక్సిల్ ఆధ్వర్యంలో 10వ ఎడిషన్ ఇంటర్నేషనల్ ఫార్మా ఎగ్జిబిషన్ ఐపెక్స్ జరుగనుందని ఉదయ భాస్కర్ తెలిపారు. ఆగస్ట్ 28 నుంచి 30 వరకు గ్రేటర్ నోయిడాలోని ఐఇఎంఎల్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారత్ నుంచి 440 ఎక్స్ పోర్టర్స్ పాల్గని వారి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని తెలిపారు. 120 దేశాల నుంచి 500 మంది ఓవర్సీస్ బిజినెస్ డెలిగేట్స్ ఇందులో పాల్గనే అవకాశం ఉందన్నారు. దేశంలో 748 యూనిట్లకు యుఎస్ఎఫ్‌డిఎ అనుమతులు ఉన్నాయని తెలిపారు. 2004–05లో 3.9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఔషధ ఎగుమతులు.. 2023–24 నాటికి 27.85 బిలియన (రూ.2.32 లక్షల కోట్లు)కు చేరాయన్నారు. ఈ కాలంలో ప్రతీ ఏడాది సగటున 11 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు.

# రూ.883లకే విమాన ప్రయాణం.....!

విమానం ఎక్కాలన్నది చాలా మంది కల.. దానిని ఇటీవల సామాన్యులు కూడా నెరవేర్చుకుంటున్నారు. అయితే ఇంకా ఆ కల నెరవేర్చుకోలేని మిడిల్ క్లాస్ ప్రజల కోసం విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తాజాగా ఫ్లాష్ సేల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ఎక్స్‌ప్రెస్ లైట్ కింద బుక్ చేసుకుంటే చార్జీలు కేవలం రూ.883 నుంచే ప్రారంభమవుతాయని తెలిపింది. అలాగే ఇతర మాధ్యమాల ద్వారా ఎక్స్‌ప్రెస్ వాల్యూ కింద టికెట్ బుక్ చేసుకుంటే రూ.1,096 నుంచి చార్జి వసూలు అవుతాయని వెల్లడించింది. సెప్టెంబర్ 30 వరకు ప్రయాణాల కోసం జూన్ 28 వరకు చేసుకునే బుకింగ్స్‌కు ఈ చార్జీలు వర్తిస్తాయని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. ఇక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారిక వెబ్‌సైట్ https://airindiaexpress.com నుంచి టికెట్ బుక్ చేసుకునే వినియోగదారులు ఇటీవల లాంచ్ చేసిన జీరో చెక్ ఇన్ బ్యాచేజ్ ఎక్స్‌ప్రెస్ లైట్‌కు ప్రత్యేక డిస్కౌంట్లతో ఎక్స్‌క్లూజివ్ యాక్సెస్ పొందవచ్చు.



గరుడ వార్త
ఆదివారం, జూన్ 30, 2024

# ఒడిశా రథ జాతరకు 315 ప్రత్యేక రైళ్లు



భువనేశ్వర్: ఒడిశాలో జులై 6 నుంచి 19 వరకు 315 స్పెషల్ ట్రెయిన్స్ నడుపనున్నారు. పూరీ నుంచి ఈ ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. వీటిని రథ జాతర కోసం నడుపనున్నారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝీ, ఆయన డిప్యూటీలైన కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరింద లకు శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశం సందర్భంగా తెలిపారు. పర్వదినం వేళ 15 వేల మంది భక్తుల కోసం వసతి కూడా కల్పించనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే నడిపే ఈ ప్రత్యేక రైళ్లు బాదంపహాడ్, రూర్కేలా, బలేశ్వర్, సోనెపూర్, దాస్ పల్లా, జగన్నాథ్ రోడ్, సంబల్ పూర్, కేందుర్ఝర్ గఢ్, పారాదీప్, భద్రక్, అంగుల్, గునుపుర్, బంగిడిపోసి వంటి వివిధ స్టేషన్లలో ఆగుతాయి. గుండిచా జాతర, సంధ్యా దర్శనం, బహుదా జాతర, సునావేష, రథ జాతర అధర్పణ వంటి ఆచార కార్యక్రమాలకు ఈ ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

# పరిమితులకు లోబడి హుందాగా పనిచేస్తా.. స్పీకర్ అయ్యన్న పాత్రుడు



**కశింకోట,(అనకాపల్లి):** పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్పీకర్ పదవీ స్థానానికి మరింత గౌరవం పెరిగేలా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇవాళ ఉదయం విచ్చేసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడును మర్యాద పూర్వకంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎస్పీ మరళీకృష్ణలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం మీడియాతో అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ%%% అతి చిన్న వయసులో ఎన్టీఆర్ మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు.


# హైవే నిర్మాణాలపై కేంద్రానికి కొన్ని సూచనలు చేశాం: మంత్రి తుమ్మల



ఖమ్మం: విజయవాడ–జగదల్‌పూర్ హైవే విషయంలో కొన్ని మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, రహదారుల నిర్మాణంలో కేంద్రానికి పలు ప్రతిపాదనలు పెట్టినట్లు చెప్పారు. "ఖమ్మం జిల్లాలో కొన్ని గ్రామాల మీదుగా హైవే వెళ్తునందున బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరాం. ఖమ్మం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు చేశాం. గత ప్రభుత్వం రూ.180 కోట్లు కేటాయించలేక రింగ్‌రోడ్డును పక్కన పెట్టేసింది. భద్రాచలం పట్టణంలోనూ కొన్ని రోడ్ల విస్తరణకు ఆమోదం లభించింది.

భద్రాచలం నుంచి ఏటూరు నాగారం వరకు.. జగ్గయ్యపేట నుంచి వైరా, తల్లాడ మీదుగా కొత్తగూడెం వరకు 4 లైన్ల హైవేకి ప్రతిపాదనలు పంపించాం" అని మంత్రి తెలిపారు. కోదాడ–ఖమ్మం మధ్య రూ.1.039 కోట్లతో నిర్మించిన 32 కి.మీ రహదారి ఆగస్టు 30 కల్లా అందుబాటులోకి వస్తుందన్నారు. ఖమ్మం–కొరివి మధ్య రూ.445 కోట్లతో 37 కి.మీ రహదారి నిర్మాణానికి గతంలోనే అనుమతులిచ్చామని తెలిపారు. దీని నిర్మాణానికి మరో రెండేళ్లు పడుతుందని వెల్లడించారు.

# సునీతా విలియమ్స్ అంతరిక్షంలో నెలల తరబడి వేచి ఉండాల్సి రావొచ్చు



వాషింగ్టన్: బోయింగ్ కు చెందిన స్టార్ లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ ద్వారా రోదసిలోకి వెళ్లిన ఇద్దరు వ్యోమాగాములు ఎప్పుడు నేలకు తిరిగి వస్తారన్నది అగమ్యగోచరంగా ఉంది. ఆ ఇద్దరు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్ మోర్. సునీతా విలియమ్స్ కు ఇది మూడో రోదసి యాత్ర. కానీ ఆమె ఎప్పుడు భూమి మీదికి తిరిగొస్తారన్నది తెలియడం లేదు. స్పేస్ క్రాఫ్ట్ లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో వారి తిరుగు ప్రయాణం వాయిదా పడింది. నాసా కమర్షియల్ క్ర్యూ ప్రోగ్రాం మేనేజర్ స్టీవ్ స్టిచ్ కాస్తా స్టార్లయినర్స్ మిషన్ ప్రోగ్రాంని 45 రోజుల నుంచి 90 రోజులకు పొడగించే విషయాన్ని పరిశీలిస్తున్నారని సిఎన్ఎన్ నివేదించింది. స్టార్ లైనర్ స్పేస్ క్రాఫ్ట్ నుంచి హీలియం లీకవుతోందని అధికారులు చెబుతున్నారు. వ్యోమనౌకలో హీలియం లీకేజీ సమస్యను సరిదిద్దే ప్రయత్నంలో స్టార్ లైనర్ ఇంజనీర్లు ఉన్నారు.

## వాకింగ్, యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.. ఎస్పీ చెన్నూరి రూపేష్



సంగారెడ్డి: జిల్లా ఎస్పీ ఆదేశానుసారం ఆర్మ్‌డ్ రిజర్వ్ డియస్పి నరేందర్ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి, రామ రావ్, హన్మి రెడ్డి ఆర్.ఐ.లు పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు, ట్రాఫిక్ సిబ్బందికి, హోంగార్డ్ సిబ్బందితో వీక్లీ పరేడ్ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు, రోజువారీ విధులలో భాగంగా మెళకువలు నేర్చుకోవడం, డ్రిల్స్ ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు. ప్రతి రోజూ వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరమని సిబ్బంది, అధికారులు ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు.

# రాజీనామా చేసినా వీసీని వదిలిపెట్టం: ఎంపి సీఎం రమేష్

విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ధ్వజమెత్తారు. వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా చేసినా ఏయూలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ అక్రమాలపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. రాజీనామా చేసినప్పటికీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌సన్ రాజీనామాల నేపథ్యంలో పూర్వ విద్యార్థులు వర్సిటీకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఎంపీ సీఎం రమేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ దక్షణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ తదితరులు వర్సిటీకి చేరుకుని పరిశీలించారు. వర్సిటీకి వచ్చిన నేతలకు ఏయూ విద్యార్థులు, పరిశోధకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఆంధ్రా యూనివర్సిటీ నుంచే వైసీపీ కార్యకలాపాలు నడిచాయని ఆరోపించారు. ఏయూ వైసీపీ కార్యాలయంగా మారిందని విమర్శించారు. ఇక్కడ జరిగిన అవకతవకలపై జ్యుడిషియల్ ఎంక్వైరీ జరుపుతామని తెలిపారు. వర్సిటీలోని వైఎస్ విగ్రహం తొలగించడం తమకు పెద్ద పనేమీ కాదని పేర్కొన్నారు. అయితే ఉద్యోగ, విద్యార్థి సంఘాల అభిప్రాయం మేరకే దానిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏయూ ప్రతిష్ఠను మాజీ వీసీ ప్రసాదరెడ్డి దెబ్బతీశారని మండిపడ్డారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఆంధ్రా యూనివర్సిటీలో అనేక అక్రమాలు జరిగాయని విమర్శించారు. వర్సిటీలో వైఎస్ విగ్రహం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు



పెట్టారని, నియామకాలు చేశారని ఆరోపించారు. అడ్డగోలుగా పదవులు పొందిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. ఏయూలో మళ్లీ పూర్వ పరిస్థితులు రప్పిస్తామన్నారు. యూనివర్సిటీలో రాజకీయాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా రాజకీయాలు చేస్తామన్నా చంద్రబాబు ఊరుకోరని అన్నారు.

# సాయిచంద్‌కు కెటిఆర్ ఘన నివాళి

హైదరాబాద్ : చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ గాయకుడు, మాజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దివంగత వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నేడు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా సాయిచంద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సాయిచంద్ మరణించి ఏడాది అవుతుందంటే ఎవరం నమ్మలేకపోతున్నాం. తన మాటతో, పాటతో అద్భుతమైన వాగ్ధాటితో తెలంగాణ ప్రజలను ఉ



ర్రూతలూగించిన అద్భుత కళాకారుడు సాయిచంద్. మన అందరి అప్తుడు.. చిరకాలం మా గుండెల్లో నిలచిపోయే తమ్ముడు. భవిష్యత్‌లో సాయి కుటుంబం కోసం ఎల్లవేళలా పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటాం. ఆనాటి నుంచి నేటి వరకు ఎలా అండగా ఉన్నామో భవిష్యత్‌లో కూడా ఉంటాం. సాయి జ్ఞాపకార్థం పాటల సీడీలు, సంకలనాలు, పుస్తకాలు తీసుకొచ్చిన సోదరులకు అభినందనలు. తమ్ముడి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని కోరుకుంటూ కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.


# పాతబస్తీలో రూ.10 కోసం ఆటో డ్రైవర్‌ను కొట్టి చంపిన ప్రయాణికుడు!

హైదరాబాద్: హైదరాబాద్ లో దారుణం వెలుగులోకి వచ్చింది. 10 రూపాయల కోసం ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. రూ. 10 చెల్లించే విషయంలో ఓ ప్రయాణికుడు తీవ్ర వాగ్వాదం తర్వాత ఆటో డ్రైవర్‌ను తీవ్రంగా కొట్టాడు. దీంతో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ గురువారం ఆసుపత్రిలో మరణించాడు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న గుర్తు తెలియని ప్రయాణికుడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వట్టెపల్లి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అన్వర్ (39) జూన్ 12న చార్మినార్ వద్ద ఓ ప్రయాణికుడిని తన ఆటోలో ఎక్కించుకుని షంషీర్‌గంజ్‌లో దింపాడు. షంషీర్‌గంజ్ చేరుకున్న తర్వాత, ప్రయాణీకుడు రూ.10 చెల్లించాడు, అయితే అన్వర్ మరో రూ.10 చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ప్రయాణికుడు అన్వర్‌ను దూషించడమే కాకుండా కనికరం లేకుండా తీవ్రంగా కొట్టాడు. ఇది గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో ప్రయాణికుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు అన్వర్‌ను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అన్వర్ జూన్ 27న మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# వైరా రిజర్వాయర్‌లో నీళ్లు లేవ్?!

## - తాగునీటికీ తప్పని కష్టాలు

వైరా: జలకళతో నిత్యం కళకళలాడే వైరా రిజర్వాయర్ నీరు లేక వెలవెలబోయింది. ఒక వైపు సాగర్ నీరు రాకపోవడంతో, మరోవైపు వర్షాలు లేకపోవడంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. జలాశయంలో నీటి సామర్థ్యం 18.3 అడుగులు, ప్రస్తుతం 5.5 అడుగులు నీటి మట్టం ఉంది. వైరా రిజర్వాయర్ లోతట్టు విస్తీర్ణం నాలుగు వేల తొమ్మిది వందల ఎకరాలు విస్తీర్ణం కలిగి ఉంది. 1930లో నైజాం నవాబు రాజు నీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వైరా రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ ప్రాజెక్టు ఆధారంగా 14 వేల మంది ఆయకట్టుదారులు సాగు చేస్తున్నారు. ఎక్కువగా వరి సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారు. ఈ ప్రాజెక్టు పై ఆయకట్టుదారులతోపాటు మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. సుమారు 362 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా ఈ రిజర్వాయర్ ఉంది. వైరా ప్రాజెక్టు కింది సుమారు 27 వేల ఎకరాలకు కుడి, ఎడం కాలువల ద్వారా నీటి సరఫరా అవుతుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి అధికంగా సాగవుతుంది. నీరు పుష్కలంగా ఉంటే తప్పా వరి అధిక దిగుబడులు వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 18.3 అడుగులు. అయితే నీటిమట్టం 18.5 అడుగులకు చేరుకుంటే కాలువల ద్వారా నీరు విడిచి పెడతారు. ప్రస్తుతం 5.5 అడుగుల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో వర్షాలు లేవు. సాగర్ నుంచి నీరు రాలేదు. దీంతో సాగునీరు విడిచిపెట్టే పరిస్థితి





ఇప్పట్లో కనిపించడం లేదు. రుతుపవనాలు ప్రవేశించినప్పుడు కురిసిన వర్షాలకు రైతులు విత్తనాలు వేశారు. ఆ తర్వాత వర్షాలు జాడ లేదు. దీంతో విత్తనాలు మొలకలు కూడా రాలేదు. ఆందోళన చెందుతున్న రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా మూడు నియోజకవర్గాలు వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధి 12 మండలాల్లోని 362 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. రోజుకు పది కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. నీటి మట్టం పూర్తి స్థాయిలో పడిపోయింది. ప్రస్తుతం 5.5 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉంది. ప్రస్తుతం వర్షాలు జాడ లేదు. ప్రాజెక్టులో నీరు చేరకపోతే తాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుంది.

ఈ రిజర్వాయర్ లో ఉన్న మత్స్యసంపదపై వైరా, కొణిజర్ల , తల్లాడ మండలాల్లో రెండు వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ప్రతి ఏటా రెండు వందల టన్నుల తెల్ల చేపలు, 50 టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com